ఆంధ్రజ్యోతి

ఉష్ణోగ్రతలు గరిష్ఠం : 31.0 కనిష్ఠం : 23.0

ANDHRAJYOTHY 5



వనపర్తి

జిల్లా వార్తలు

శుక్రవారం 12 జూలై 2024

ఆశల పల్లకిలో..

- నామినేటెడ్ పోస్టుల భర్తీకి రంగం సిద్ధం చేస్తున్న ప్రభుత్వం
- స్థానిక ఎన్నికలకు ముందే జిల్లాల్లో నియామకం
- ఇప్పటికే వనపర్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ ఏర్పాటు
- గ్రంథాలయాలు, మార్కెట్ యార్డులు, ముడా పదవులకు భారీగా ఆశావహులు
- ఎమ్మెల్యేలకే ఎంపిక బాధ్యతలను అప్పగించిన రాష్ట్ర ప్రభుత్వం



మహబూబ్‌నగర్ వ్యవసాయ మార్కెట్ కార్యాలయం

మహబూబ్‌నగర్, జూలై 11 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ఉమ్మడి పాలమూరు జిల్లాలో నామినేటెడ్ పోస్టుల భర్తీకి రంగం సిద్ధమైంది. స్థానిక సంస్థల ఎన్నికలకు ముందే ఆయా జిల్లాల్లో ఉన్న ఆ పోస్టులను భర్తీ చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. ఇప్పటికే రాష్ట్రస్థాయిలో వివిధ కార్పొరేషన్లకు చైర్మన్లను నియమించగా, ఇంకా కొన్ని కార్పొరేషన్లపై కసరత్తు జరుపుతోంది. ఇటీవల పాలమూరులో పర్యటించిన సీఎం రేవంత్‌రెడ్డి.. రుణమాఫీ తర్వాత స్థానిక సంస్థల ఎన్నికలకు వెళ్తామని తెలిపారు. ఆగస్టు 15లోపు రుణమాఫీ చేస్తామని ప్రకటించగా, ఆ దిశగా ప్రభుత్వం మార్గదర్శకాలను కూడా సిద్ధం చేస్తోంది. సెప్టెంబరు లేదా అక్టోబరులో స్థానిక సంస్థల ఎన్నికలకు ప్రభుత్వం సంసిద్ధత వ్యక్తం చేయనుంది. ఈ నేపథ్యంలో ఆ ఎన్నికలకు ముందే నామినేటెడ్ పోస్టులను భర్తీ చేయనున్నారు. వారి ఎంపిక బాధ్యతను స్థానిక ఎమ్మెల్యేలకు అప్పగించింది. ఇప్పటికే వనపర్తి నియోజకవర్గంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకవర్గాన్ని నియమిస్తూ ఉత్తర్వులు జారీ కాగా.. అన్ని జిల్లాల్లో మొదట వ్యవసాయ మార్కెట్ కమిటీలు, తర్వాత గ్రంథాలయ సంస్థలు, ప్రధాన దేవాలయాలకు సంబంధించి పాలకవర్గాలను నియమించే అవకాశం ఉంది. పదేళ్లుగా కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో అధికారంలో లేదు. దాంతో చాలా మంది పదవులు లేకపోయినప్పటికీ పార్టీని నమ్ముకుని ఉన్నారు. అలాగే కీలక సమయాల్లో ఇతర పార్టీల నుంచి కాంగ్రెస్‌లో చేరిన వారు కూడా ఉన్నారు. ప్రస్తుతం సర్దుబాటు విషయం.. ఎమ్మెల్యేలకు కొంత ఇబ్బందిగా మారొచ్చు. కానీ త్వరితగతిన పాలకవర్గాలను నియమిస్తే.. స్థానిక సంస్థల నాటికి కొంతమందిని సర్దుబాటు చేయొచ్చనే భావనలో ప్రభుత్వం ఉన్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే ఆయా ఎమ్మెల్యేలు కొన్ని ప్రతిపాదనలను ప్రభుత్వం దృష్టికి కూడా తీసుకపోయారు. గడిచిన ఎన్నికల్లో బీఆర్ఎస్ ఓటమి చెందడంతో.. ఆ ప్రభుత్వం నియమించిన పాలకవర్గాలను మొత్తం కాంగ్రెస్ ప్రభుత్వం రద్దు చేసింది. ఇప్పుడు వాటి భర్తీ అనివార్యం కాగా.. ఆశావహులు భారీగా ఎదురు చూస్తున్నారు.

అధికంగా ఆశావహులు..

నామినేటెడ్ పోస్టుల కోసం అన్ని జిల్లాల్లో పోటాపోటీ నెలకొంది. ప్రధానంగా మార్కెట్ యార్డులు, దేవస్థానాలు, గ్రంథాలయ సంస్థల పోస్టులను ఆశిస్తున్నారు. నాయకులు కూడా ఇప్పుడే కొంతమందిని ఈ పోస్టుల్లో భర్తీ చేస్తే సర్పంచ్, ఎంపీటీసీ, జడ్పీటీసీ సభ్యులు, ఎంపీపీ, జడ్పీచైర్మన్ పోస్టుల విషయంలో సులభమవుతుందని భావిస్తున్నారు. గద్వాల మార్కెట్ యార్డు కోసం ఇప్పటికే

మిగతా జిల్లాల్లోనూ పోటీ..

ధనలక్ష్మి కృష్ణమూర్తి పేరును నియోజకవర్గ ఇన్‌చార్జి సరిత పంపించగా.. ఇంకా నిర్ణయం మాత్రం జరగలేదు. గద్వాల ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి బీఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లో చేరడంతో.. ఇప్పుడు పాత ప్రతిపాదనల మేరకు పాలకవర్గాన్ని నియమిస్తారా? లేక కొత్త వారిని ఎమ్మెల్యే నేతృత్వంలో నియమిస్తారా? అనే సందిగ్ధం నెలకొంది. జోగుళాంబ దేవస్థానం, అలంపూర్, పెబ్బేరు, మదనాపూర్, దేవరకద్ర, నవాబుపేట, మక్తల్, నారాయణపేట, కోస్గి, కొల్లాపూర్, నాగర్‌కర్నూల్, కల్వకుర్తి, అచ్చంపేట మార్కెట్ యార్డులకు సంబంధించి కూడా ఆయా నియోజకవర్గాల ఎమ్మెల్యేలు ప్రతిపాదనలు పంపినట్లు సమాచారం. ఈ వారం రోజుల్లో కమిటీల నియామకం పూర్తి కానుంది.

ప్రతిపాదనలివే..

మహబూబ్‌నగర్ జిల్లాలో నామినేటెడ్ పోస్టుల కోసం ఆశావహులు ఎక్కువ సంఖ్యలో ఉన్నారు. ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి ఇప్పటికే ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపినట్లు తెలుస్తోంది. మహబూబ్‌నగర్ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ(ముడా) చైర్మన్‌గా కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు లక్ష్మణ్‌యాదవ్ పేరును పంపించగా.. జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్‌రెడ్డి మరో వ్యక్తిని ప్రతిపాదించినట్లు తెలుస్తోంది. మహబూబ్‌నగర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా ఓసీ మహిళకు రిజర్వేషన్ ఉంది. ఈ పదవి కోసం మహిళా కాంగ్రెస్ మాజీ అధ్యక్షురాలు, మాజీ ఎమ్మెల్సీ జగదీశ్వర్‌రెడ్డి కుమార్తె బెక్కరి అనిత పేరును పంపించినట్లు తెలుస్తోంది. అయితే మహబూబ్‌నగర్ రూరల్ మండలానికి చెందిన మల్లు నర్సింహారెడ్డి సతీమణి పేరును కూడా పరిశీలించాలని కోరుతున్నారు. పార్టీలో ప్రత్యక్ష రాజకీయాల్లో ఉన్న మహిళ కావడంతో బెక్కరి అనితనే నియమించే అవకాశం ఎక్కువగా ఉన్నట్లు తెలుస్తోంది. జడ్చర్ల మార్కెట్ యార్డు కోసం జ్యోతి అల్వాల్‌రెడ్డి పేరును పరిశీలిస్తున్నట్లు సమాచారం. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్‌గా సీనియర్ నేత సత్తూరు చంద్రకుమార్ గౌడ్ పేరును ప్రభుత్వానికి సిఫారసు చేశారని సమాచారం. ఇదే పోస్టుకు జడ్చర్ల కాంగ్రెస్ నేత రబ్బాని కూడా ప్రయత్నాలు జరుపుతున్నారు. రోడ్డు ట్రాన్స్‌పోర్ట్ అథారిటీ మెంబర్ పోస్టుకు మూడు నియోజకవర్గాల నుంచి చాలామంది ప్రయత్నాలు చేస్తుండగా.. మైనారిటీల నుంచి ఇద్రీస్ పేరు ప్రధానంగా పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది. అయితే నామినేటెడ్ పోస్టులు మహబూబ్‌నగర్‌కే ఎక్కువగా దక్కే అవకాశం ఉందని, అందుకే మిగతా నియోజకవర్గాలకు కూడా ప్రాధాన్యమివ్వాలని ఎమ్మెల్యేలు భావిస్తున్నారు.



మహబూబ్‌నగర్ జిల్లా గ్రంథాలయం

కోళ్ల వ్యర్థాలతో..

రూ.కోట్లు స్వాహా

- వేలం వేయకుండా చికెన్, చేపల వ్యర్థాల తరలింపు
- వ్యాపారులతో పాలకుల లోపాయికారి ఒప్పందాలు
- ఆదాయాన్ని కోల్పోతున్న వనపర్తి పురపాలిక
- పట్టింపు లేని మునిసిపల్ అధికారులు



చికెన్, చేపల వ్యర్థాలను తరలిస్తున్న వాహనం(ఫైల్)

వనపర్తి టౌన్, జూలై 11: వనపర్తి మునిసిపాలిటీలో చికెన్, చేపల వ్యర్థాల తరలింపునకు వేలం వేయడం లేదు. చేపలు, పందులకు ఆహారంగా ఉపయోగించే ఈ వ్యర్థాల తరలింపునకు గత పాలకులు టెండరు లేకుండా లోపాయికారి ఒప్పందం చేసుకున్నారని తెలుస్తోంది. దాంతో కొందరు ప్రజాప్రతినిధులు, నాయకులు, వ్యాపారుల జేబులు నిండుతుండగా.. పురపాలిక నెలకు రూ.లక్షల్లో ఆదాయాన్ని కోల్పోతోంది. రోజువారి తైబజార్, జంతు వధశాల, వారాంతపు సంతలకు బహిరంగ వేలం నిర్వహిస్తున్న మునిసిపల్ అధికారులు ఏటా కోటి రూపాయలకుపైగా టర్నోవర్ అవుతున్న చికెన్, చేపల వ్యర్థాల తరలింపును మాత్రం ఎందుకు మినహాయిస్తున్నారో పట్టణ ప్రజలకు అంతు చిక్కడం లేదు.

రెండు వాహనాల్లో తరలింపు..

వనపర్తి పట్టణంలో దాదాపు 150 నుంచి 200 వరకు చికెన్ షాపులు, ఐదారు సెంటర్లలో చేపల అమ్మకాలు జోరుగా సాగుతున్నాయి. వాటి నుంచి వెలువడే వ్యర్థాలను ఇతర ప్రాంతాలకు తరలించాలంటే దాదాపు రెండు బొలెరో వాహనాలు అవసరం అవుతాయి. ఈ వ్యర్థాలను ఆంధ్రప్రదేశ్‌లోని కర్నూల్‌తో పాటు ఇతర ప్రాంతాలకు తరలించి.. చేపలు, పందులకు ఆహారంగా ఉపయోగిస్తున్నారని తెలుస్తోంది. ఈ వ్యర్థాల తరలింపునకు గత పాలకులు ఎలాంటి బహిరంగ వేలం లేకుండా లోపాయికారి ఒప్పందం చేసుకున్నారని చర్చ జరుగుతోంది. ప్రస్తుత ప్రభుత్వమైనా మునిసిపల్ ఆదాయం కొందరు ప్రజా ప్రతినిధులు, నాయకులు, వ్యాపారుల జేబుల్లోకి వెళ్లకుండా కాపాడాలని ప్రజలు కోరుతున్నారు.

రూ.కోట్లలో వ్యాపారం..

పట్టణం నుంచి సేకరించిన ఈ వ్యర్థాలను కొందరు వ్యక్తులు రోజూ రెండు బొలెరో వాహనాల్లో ఏపీలోని వివిధ ప్రాంతాలకు తరలిస్తున్నారు. ఒక్క వాహనంలో దాదాపు 2,500 కిలోల వ్యర్థాలు తరలిస్తున్నారు. రెండు వాహనాల్లో కలిపి 5,000 కిలోల వ్యర్థాలు ఉంటున్నాయి. వీటిని పందులు, చేపలకు ఆహారంగా వేసేందుకు కిలో దాదాపు రూ.ఆరు నుంచి రూ.10 వరకు విక్రయిస్తున్నారని తెలుస్తోంది. ఈ లెక్కన 5,000 కిలోలకు రూ.ఆరు ప్రకారం అయితే రూ.30 వేలు.. రూ.10 ప్రకారం అయితే రూ.50 వేలు రోజుకు ఆదాయం వస్తోంది. అదే నెలకు అయితే కిలోకు రూ. ఆరు ప్రకారం అయితే రూ.తొమ్మిది లక్షలు, రూ.10 ప్రకారం అయితే రూ.15 లక్షలు వస్తున్నాయి. ఏడాదికి దాదాపు రూ.కోటిన్నర టర్నోవర్ దాటుతున్న ఈ వ్యర్థాల తరలింపునకు వేలం వేయకపోవడంతో మునిసిపాలిటీ ఆదాయానికి భారీగా గండి పడుతోంది. ఇదంతా తెలియక దీన్ని కొందరు చీప్‌గా చూస్తున్నారు.



కోళ్ల వ్యర్థాలకు బహిరంగ వేలం నిర్వహించొద్దంటూ మునిసిపల్ కార్యాలయం ముందు ధర్నా చేస్తున్న పందుల పెంపకందారులు

టెండర్ వద్దంటూ ధర్నా

మునిసిపల్ పరిధిలో నిర్వహించే తైబజార్, జంతు వధశాల, వారాంతపు సంత కోసం వేలం పాట కోసం పట్టణంలో అధికారులు వారం రోజులుగా ప్రచారం చేశారు. ఆసక్తి గల వారు బహిరంగ వేలంలో పాల్గొనాలని వాహనాలకు మైక్‌లు ఏర్పాటు చేసి తెలియజేస్తున్నారు. దీంట్లోనే చికెన్, చేపల వ్యర్థాలకు కూడా బహిరంగ వేలం నిర్వహించాలనేది అధికారుల అభిమతం. కానీ వ్యర్థాల తరలింపు కోసం సరైన పద్ధతిలో ప్రచారం చేయకపోవడంపై ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. ఇదిలా ఉంటే చికెన్, చేపల వ్యర్థాల తరలింపు ప్రక్రియకు బహిరంగ వేలం నిర్వహించొద్దని కొందరు పందుల పెంపకదారులు మునిసిపల్ కార్యాలయం వద్ద గురువారం ఆందోళన చేపట్టారు. వాటికి వేలం నిర్వహిస్తే.. పందులు పెంచుకుంటున్న తాము జీవనాధారం కోల్పోతామని, వేలం రద్దు చేసి వ్యర్థాల తరలింపును తమకే కట్టబెట్టాలని ధర్నాకు చేశారు. ఈ తతంగం వెనుక దాగున్న మర్మం ఎంటో కలెక్టర్ చిక్కుముడి విప్పాల్సిన అవసరం ఉంది. ఈ వ్యవహారం పాత పద్ధతిలోనే కొనసాగితే మునిసిపల్ ఆదాయం యధావిధగా పక్కదారి పట్టి, కొందరి జేబులు నిండనున్నాయి.

అన్నింటికీ వేలం పాట ఉంటుంది

మునిసిపల్ పరిధిలో నిర్వహించే తైబజార్, వారపు సంత, జంతువధశాల వేలంతో పాటు చికెన్, చేపల వ్యర్థాల తరలింపునకు కోసం కూడా బహిరంగ వేలం ఉంటుంది. బహిరంగ వేలంపాటలో ఎవరైనా స్వచ్ఛందంగా పాల్గొనవచ్చు. ఇందులో లోకల్, నాన్‌లోకల్ అనే నిబంధన కూడా ఏమీ లేదు. చికెన్, చేపల వ్యర్థాల తరలింపునకు త్వరలోనే బహిరంగ వేలంపాట నిర్వహిస్తాం.

\- పూర్ణ చందర్, మునిసిపల్ కమిషనర్, వనపర్తి

గిట్టుబాటుకాని

అటవీ ఉత్పత్తులు

- నల్లమలలో తగ్గుతున్న అటవీ సంపద
- అంతరించిపోతున్న తేనెటీగలు
- ఉపాధి కరువైన చెంచులు



నల్లమలలో అడవిలో సేకరించిన నన్నారి వేర్లను చూపుతున్న చెంచు మహిళ

నాగర్‌కర్నూల్, జూలై 11 (ఆంధ్రజ్యోతి): తరాల తరబడి నల్లమల అడవిని నమ్ముకున్న చెంచుల జీవనం ఆగమ్యగోచరంగా మారుతోంది. క్రమంగా అంతరించిపోతున్న ఉత్పత్తులు కారణంగా అడవి బిడ్డలు అల్లాడుతున్నారు. తమకు ఉపాధి కరువవుతోందని, మైదాన ప్రాంతాల్లో పునరావాసం కల్పించాలని ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

కాలుష్యంతో ఉపాధిపై వేటు

నల్లమలలో దాదాపు పది వేల మంది చెంచులు నివసిస్తున్నారు. అమ్రాబాద్ పులుల అభయారణ్యం 20,166 చదరపు కిలో మీటర్ల మేర విస్తరించి ఉంది. చెంచుల ప్రధాన జీవనోపాధి అటవీ ఉత్పత్తుల సేకరణే. నల్లమలలో దొరికే తేనె, జిగురు, కుంకుడుకాయలు, సుగంధ వేర్లు, ఇప్ప పువ్వు సేకరించి విక్రయించడం ద్వారా బతుకుతున్నారు. అయితే నల్లమల ప్రాంతం చుట్టూ పట్టణీకరణ పెరగడంతో అడవి బిడ్డల ఉపాధికి ఆటంకం ఏర్పడింది. అటవీ ప్రాంత సమీప గ్రామాల్లో పత్తి, మిర్చితో సహా వివిధ రకాల వాణిజ్య పంటలను పండించే రైతులు అధిక మోతాదులో ఎరువులు, రసాయనిక మందులను వినియోగిస్తుండటంతో తేనెటీగల పునరుత్పత్తి నశించింది. దీని పర్యవసానంగా పరపరాగ సంపర్కం జరగకపోవడంతో ఇప్పపూలు, చింత పండు, వివిధ రకాలైన అటవీ పండ్లకు సంబంధించి తీవ్రమైన ప్రభావం ఏర్పడింది. మరో పక్క రాష్ట్రంలో ఎక్కడ అడవి పందులు, కోతులు ఉన్నా తీసుకొచ్చి నల్లమల అడవిలో వదులుతున్నారు. దీని కారణంగా కూడా చెంచుల ఉపాధిపై దెబ్బపడింది. అటవీ ప్రాంతంతో అనుబంధం ఉన్న కోతులు, అడవి పందులు పంటల జోలికి వెళ్లవు. పట్టణ ప్రాంతాల నుంచి తీసుకొచ్చి అడవుల్లోకి వదులుతున్న జంతువుల ద్వారా తమకు తీవ్ర నష్టం వాటిల్లుతుందని అడవి బిడ్డలు వాపోతున్నారు.



సేకరించిన మార్పటాకులతో చెంచులు

ధరల్లో కోత

అడవిలో వన్యప్రాణుల మధ్య ఉంటూ, ప్రాణాలను పణంగా పెట్టి చెంచులు సేకరిస్తున్న అటవీ ఉత్పత్తులకు గిరిజన కార్పొరేషన్ నుంచి మద్దతు ధర లభించడం లేదు. అనేక ఒడిదుడుకులను ఎదుర్కొని నల్లమలలో నాణ్యమైన తేనెను సేకరిస్తే కిలోకు కేవలం రూ.225 మాత్రమే ఇస్తున్నారు. ఇదే తేనెకు బహిరంగ మార్కెట్‌లో రూ.800 నుంచి రూ.1000 ధర పలుకుతోంది. సుగంధ ద్రవ్యాలు, సబ్బుల్లో వినియోగించే మారేడు గడ్డలు కిలోకు గిరిజన కార్పొరేషన్‌లో రూ.190 చెల్లిస్తుండగా, బహిరంగ మార్కెట్‌లో రూ.400 ఇస్తున్నారు. అదేవిధంగా ముష్టి గింజలకు రూ.45 ఇస్తుండగా బయట మార్కెట్‌లో 60, కుంకుడుకాయలకు రూ.40 చెల్లిస్తుండగా బయట మార్కెట్‌లో రూ.60, కానుగ కాయలకు గిరిజన కార్పొరేషన్‌లో రూ.10 ఇస్తుండగా బయట రూ.20కి కొంటున్నారు. ఇప్పపలుకు ధరలకూ బాగా వ్యత్యాసం ఉంది.

శ్రమకు తగ్గ ప్రతిఫలం ఇవ్వాలి



చెంచులు చెమటోడ్చి సేకరించే అటవీ ఉత్పత్తులకు గిట్టుబాటు ధరలు కల్పించడంలో జీసీసీ విఫలమైంది. మల్లాపూర్‌పెంటలో జీసీసీ డీఆర్ డిపో ఉప కేంద్రాన్ని సైతం ఎత్తేశారు. రేషన్ బియ్యం కోసం మాత్రమే మన్ననూర్‌లోని జీసీసీ కార్యాలయానికి చెంచులు వెళ్తున్నారు. అటవీ ఉత్పత్తులకు మద్దతు ధరను చెల్లించి, చెంచులకు శ్రమకు తగిన కూలీ అందేలా చర్యలు తీసుకోవాలి. అడవుల్లో తగ్గిపోయిన చిగురు ప్లాంటేషన్లను అభివృద్ధి చేయాలి. ప్రమాద బీమా అమలు చేసి, రుణాలు ఇవ్వాలి.

\- చిగుర్ల బయన్న, మల్లాపూర్‌పెంట

రైతు భరోసాపై నేడు అభిప్రాయ సేకరణ

- వనపర్తికి రానున్న ఆరుగురు మంత్రులు



ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మేఘారెడ్డి, ఇన్‌చార్జి కలెక్టర్

వనపర్తి అర్బన్, జూలై 11 : రైతు భరోసా పథకంపై నేడు వనపర్తి జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో కీలక సమావేశం జరుగనున్నది. సమావేశానికి ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కతో పాటు, ఐదుగురు మంత్రులు, ఉమ్మడి జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు హాజరుకానున్నారు. అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ ఇచ్చిన హామీల్లో ఒకటైన రైతుభరోసా పథకానికి విధి విధానాల ఖరారు దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తుంది. అందులో భాగంగా నిర్వహిస్తున్న ఈ సమావేశంలో రైతులు, వ్యవసాయ శాఖ అధికారులతో మాట్లాడి అభిప్రాయాలు సేకరించనున్నారు. గత ప్రభుత్వం ఎకరానికి రూ.10 వేల చొప్పున ఇవ్వగా, కాంగ్రెస్ ప్రభుత్వం రూ.15 వేల చొప్పున అందిస్తామని ప్రకటించింది. అయితే రైతులకు పెట్టుబడి సాయం అందించే రైతుబంధు గతంలో దుర్వినియోగానికి గురైంది. పలువురు రియల్ వెంచర్లు, గుట్టలు, రోడ్లు, కళాశాలలు ఉన్న భూములకు కూడా ఎకరానికి రూ.5 వేల చొప్పున రైతుబంధు తీసుకున్నారు. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఈ సాయాన్ని ఎకరానికి రూ.7500 ఇస్తామని ప్రకటించింది. అధికారంలోకి వచ్చిన నాటి నుంచే రైతు భరోసా అమలులో మార్పులు తీసుకొస్తామని చెబుతున్నారు. ఎన్ని ఎకరాల వరకు పెట్టుబడి సాయం ఇవ్వాలి, ఎవరికి ఇవ్వాలి తదితర అంశాలపై ఇప్పటికే వ్యవసాయ శాఖ, సహకార సంఘాల ద్వారా అభిప్రాయ సేకరణ పూర్తయ్యింది.

నేడు ముఖ్య సమావేశం

జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన ముఖ్య సమావేశానికి రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, రెవెన్యూ గృహ నిర్మాణ సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు, ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జీ మంత్రి దామోదర రాజనర్సింహ, ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావుతో పాటు ఉమ్మడి జిల్లాలోని ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, వ్యవసాయ శాఖ అధికారులు, రైతులు హాజరుకానున్నారు. ఉదయం 10:30 గంటలకు ప్రారంభమయ్యే ఈ సమావేశంలో రైతు భరోసా అమలు విధి విధానాలపై అభిప్రాయాలు సేకరించనున్నారు.

గాంధీ ట్రస్టు భూములపై..

లోకాయుక్త విచారణ

- వేంకటేశ్వరస్వామి దేవాలయ భూములపైనా..
- నివేదికను అందిస్తామన్న విచారణ బృందం



వేంకటేశ్వరస్వామి దేవాలయ భూములను పరిశీలిస్తున్న లోకాయుక్త పరిశోధన బృందం

జడ్చర్ల, జూలై 11: జడ్చర్ల మునిసిపాలిటీ పరిధిలోని గాంధీ ట్రస్టు, వేంకటేశ్వరస్వామి దేవాలయ భూములను లోకాయుక్త విచారణ పరిశోధన బృందం గురువారం పరిశీలించింది. లోకాయుక్త ఆదేశానుసారం బృందం డిప్యూటీ డైరెక్టర్ ముత్యంరావు, డీఎస్పీ విద్యాసాగర్‌రావు, పీవీ చారిలు మునిసిపాలిటీలోని సర్వే నెంబరు 67, 223, 273లలో ఉన్న 30 ఎకరాల గాంధీ ట్రస్టు, వేంకటేశ్వరస్వామి దేవాలయ భూములను పరిశీలించారు. మొదటగా తహసీల్దార్ కార్యాలయంలో మహబూబ్‌నగర్ ఆర్డీవో నవీన్, రెవెన్యూ, మునిసిపల్, సర్వేవిభాగం, దేవాదాయశాఖ అధికారులతో పాటు భూములు అన్యాక్రాంతం అయ్యాయంటూ లోకాయుక్తలో ఫిర్యాదు చేసిన అనిల్‌కుమార్, తెలుగు సత్తయ్య, ఎంటీ బాలకృష్ణ, అయ్యన్న, ఖయ్యూంలతో సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా భూములకు సంబంధించిన రిజిష్టర్‌లు, పత్రాలను చూశారు. అనంతరం గాంధీట్రస్టు, శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయాల భూములను పరిశీలించారు. ఈ సందర్భంగా లోకాయుక్త పరిశోధన విభాగం డిప్యూటీ డైరెక్టర్ ముత్యంరావు, డీఎస్పీ విద్యాసాగర్‌రావు విలేకరులతో మాట్లాడారు. గాంధీ ట్రస్టు భూములు 67, 223, 273లలో 30 ఎకరాలు అన్యాక్రాంతం అయ్యాయని చెప్పారు. అనధికారికంగా ఇళ్ల నిర్మాణం చేపట్టారని తెలిపారు. అధికారులు పట్టించుకోకపోవడంతోనే భూములు అన్యాక్రాంతం అయ్యాయన్న ఫిర్యాదు మేరకు లోకాయుక్తలో కేసు రిజిష్టర్ అయ్యిందని అన్నారు. లోకాయుక్త ఆదేశాల మేరకు విచారణతో పాటు పరిశోధించడానికి వచ్చినట్లు వారు పేర్కొన్నారు. గాంధీ ట్రస్టు భూములలో 30 ఎకరాలు అన్యాక్రాంతం కాగా, ఎనిమిది ఎకరాలు ఓపెన్‌గా కనిపిస్తుందన్నారు. ట్రస్టు భూమి అన్యాక్రాంతం అయ్యిందా?.. ట్రస్టుకే ఉందా?.. ఓపెన్‌గా కనిపిస్తున్న భూమి ఎవరికైన రిజిష్టర్ అయ్యిందా? అనేది పరిశీలించాల్సి ఉందని తెలిపారు. వేంకటేశ్వరస్వామి దేవాలయానికి సంబంధించిన 102 ఎకరాల భూమి అన్యాక్రాంతం అయ్యిందన్న ఫిర్యాదు మేరకు నమోదయిన కేసుపై పరిశీలించామని తెలిపారు. గాంధీ ట్రస్టు సభ్యులకు ప్రత్యేకంగా నోటీసు జారీ చేసి, ట్రస్టు డీడ్, సబ్ సీక్వెంట్‌గా చేసుకున్న మార్పులు, బైలా, ఆడిట్ అంశాలను పరిశీలిస్తామని చెప్పారు. రెండు భూముల విచారణతో పాటు పరిశోధించిన అంశాల పూర్తి నివేదికలను లోకాయుక్తకు సమర్పిస్తామని వెల్లడించారు. పరిశీలనలో జడ్చర్ల తహసీల్దార్ సత్యనారాయణరెడ్డి, లోకాయుక్త పరిశోధన బృందం ఎస్ఐ పీవీ చారి, జడ్చర్ల మునిసిపల్ కమిషనర్ రాజయ్య, టీపీవో ప్రతాప్, దేవాదాయ అసిస్టెంట్ కమిషనర్ శ్రీనివాసరాజు, వివిధ శాఖల అధికారులు వెంకట్, కిషన్‌రావు, ఆనంద్‌కుమార్, శ్రీనివాసులు, వీణాధరి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

పాలెం కాలేజీకి అటానమస్ హోదా


పాలెంలోని వేంకటేశ్వర ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ సైన్స్ డిగ్రీ కళాశాల

బిజినేపల్లి, జూలై 11 : నాగర్‌కర్నూల్ జిల్లా బిజినేపల్లి మండలం పాలెంలోని శ్రీవేంకటేశ్వర ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు యూజీసీ(యూనివర్సిటీ గ్రాంట్స్ కమీషన్) అటానమస్ (స్వయం ప్రతిపత్తి) హోదాను జూలై 10న ప్రకటించినట్లు యూజీసీ డిప్యూటీ సెక్రెటరీ డాక్టర్ గోపిచంద్ మెరుగు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.విద్యారాణికి సమాచారం ఇచ్చారు. పాలెం కళాశాలకు అటానమస్ హోదా రావడంపై కళాశాల స్థాపించిన తోటపల్లి సుబ్రమణ్యం(సుబ్బయ్య అయ్యగారు) కుటుంబ సభ్యులు, కళాశాల పూర్వ విద్యార్థులు, గ్రామస్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. అంతేకాకుండా వారందరూ కూడా తమ బాధ్యత మరింత పెరిగిందని కళాశాల అభివృద్ధికి మరింత చిత్తశుద్ధితో పనిచేస్తామని సంతోషం వ్యక్తం చేస్తున్నారు. నాగర్‌కర్నూల్ జిల్లాలో స్వయం ప్రతిపత్తి హోదా పాలెం డిగ్రీ కళాశాలకు మాత్రమే దక్కింది. పాలమూర్ యూనివర్సిటీ పరిధిలో ఉన్న పాలెం ఎస్వీ ప్రభుత్వ కళాశాలకు అటానమస్ హోదా ఇవ్వాలని అందుకు అవసరమైన అన్ని రకాల మౌలిక వసతులు, నాణ్యతా ప్రమాణాలు ఉన్నాయని కళాశాల ప్రిన్సిపాల్ యూజీసీకి దరఖాస్తు చేశారు. దరఖాస్తు పరిశీలించిన యూజీసీ అటానమస్ స్టాండింగ్ కమిషన్ 2024, జూన్ 25న ప్రత్యేక సమావేశం నిర్వహించి పాలెం కళాశాలకు స్వయం ప్రతిపత్తి హోదా కల్పించేందుకు నిర్ణయం తీసుకుంది. స్వయం ప్రతిపత్తి హోదా 2024-25 విద్యాసంవత్సరం నుంచి 2028-29 విద్యా సంవవత్సరం ఐదు సంవత్సరాల పాటు ఉంటుందని కమిషన్ ఉత్తర్వుల్లో పేర్కొంది. స్వయం ప్రతిపత్తి హోదా కొనసాగింపునకు గడువుకు మూడు నెలల ముందే దరఖాస్తు చేసుకోవాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. స్వయం ప్రతిపత్తి హోదా ఉన్న కళాశాల యూజీసీ నియమ నిబంధనలకు కట్టుబడి ఉండాలి. యూజీసీ పేర్కొన్న నిబంధనలు, నిర్దేశించిన అవసరాలు, షరతులకు అనుగుణంగా లేని పక్షంలో యూజీసీ క్లాజ్ 13 ప్రకారం చర్యలు తీసుకోనున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. రాబోయ్యే రోజుల్లో అటానమస్ హోదాను సద్వినియోగం చేసుకొని కళాశాలను విశ్వ విద్యాలయంగా రూపుదిద్దేందుకు ఈ ప్రాంత ప్రజా ప్రతినిధులు ఇబ్బడి ముబ్బడిగా నిధులు తీసుకొచ్చి అన్ని రకాల వసతులు కల్పించి విద్యార్థులకు ఉన్నత విద్యా అవకాశాలు అందుబాటులో ఉండేలా పాటుపడాలని స్థానికులు కోరుకుంటున్నారు.


పాలెం కళాశాలను స్థాపించిన తోటపల్లి సుబ్రమణ్యం విగ్రహం

స్వయం ప్రతిపత్తితో బాధ్యతలు విస్తృతమయ్యాయి



60 సంవత్సరాల క్రితం పాలెంలో సుబ్బయ్య అయ్యగారు ప్రోత్సలంతో ఏర్పాటు చేసిన ఎస్వీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు స్వయం ప్రతిపత్తి హోదాను యూజీసీ కల్పిచడం ఎంతో ఆనందకరమైన విషయం. దీంతో ప్రిన్సిపాల్‌గా, కళాశాల సిబ్బంది అందరి బాధ్యతలు మరింత పెరిగాయి.

- డాక్టర్ ఎస్.విద్యారాణి, కళాశాల ప్రిన్సిపాల్, పాలెం

అటానమస్ హోదా కళాశాల పనితీరుకు గుర్తింపు



పాలెం ఎస్వీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు యూజీసీ అటానమస్ హోదా కల్పించడం 60 ఏళ్లుగా కళాశాల పనితీరుకు గుర్తింపునకు తార్కానం. మేము చదువుకున్న కళాశాలకు స్వయం ప్రతిపత్తి హోదా రావడం సంతోషంగా ఉంది.

- పుప్పాల శ్రీనివాస్ గౌడ్, పూర్వ విద్యార్థి, ఎస్వీ డిగ్రీ కళాశాల, పాలెం

చెట్టుకు ఉరి వేసుకొని గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య



ఆత్మహత్య చేసుకున్న గుర్తు తెలియని వ్యక్తి

నారాయణపేట, జూలై 11 : చెట్టుకు ఉరి వేసుకొని ఓ గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన నారాయణపేట జిల్లా కేంద్రంలో గురువారం చోటు చేసుకుంది. నారాయణపేట ఎస్ఐ వెంకటేశ్వర్లు కథనం ప్రకారం.. నారాయణపేట ఎంబీహెచ్‌ఎస్ పాఠశాల ఆవరణలో కానుగ చెట్టుకు ఉరి వేసుకొని గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడని, మృతుడు తాను ధరించిన లుంగీని కొంత భాగం చించి దానితోనే చెట్టుకు ఉరి వేసుకున్నాడని తెలిపారు. మృతుడి శరీరంపై నల్లటి మచ్చలు ఉన్నాయన్నారు. చొక్కాపై టైలర్ శ్రీమాన్ కేసీఎం అని ఉందని తెలిపారు. మృతదేహాన్ని జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి మార్చురికి తరలించామని, సంబంధీకులు నారాయణపేట పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలని ఎస్ఐ కోరారు.

చికిత్స పొందుతూ బాలుడి మృతి

మల్దకల్, జూలై 11 : జోగుళాంబ గద్వాల జిల్లా మల్దకల్ మండలం నేతువానిపల్లి గ్రామంలో గోడ పైనుంచి కింద పడి తీవ్ర గాయాలపాలైన బాలుడు చికిత్స పొందుతూ మృతి చెందాడు. హెడ్ కానిస్టేబుల్ గోపాల్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన బోయ తిమ్మప్ప కుమారుడు అభిరామ్(6) ఈనెల మూడో తేదీన ఇంటి పక్కన ఉన్న పెద్ద తిమ్మప్ప ఇంటి వద్ద ఆడుకుంటూ గోడ పైనుంచి కింద పడ్డాడు. తలకు బలమైన గాయాలైన బాలుడిని కర్నూలు ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మృతి చెందాడు. బాలుడి తండ్రి ఫిర్యాదు మేరకు గురువారం కేసు నమోదు చేసినట్లు హెచ్‌సీ తెలిపారు.

రాష్ట్ర స్థాయి ఫుట్‌బాల్ పోటీలకు జడ్చర్ల విద్యార్థులు

జడ్చర్ల, జూలై 11 : రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీలకు బాదేపల్లి బాలుర జడ్పీహెచ్‌ఎస్ విద్యార్థులు ఎంపికయ్యారు. ఈ నెల 12 నుంచి 14వ తేదీ వరకు నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తిలో జరగనున్న సబ్‌జూనియర్ రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీలకు విద్యార్థులు వర్ష, అనూష, పల్లవి, పూజ, నికితలు ఎంపికయ్యారని పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు చంద్రకళ తెలిపారు. ఈ సందర్భంగా గురువారం పాఠశాల ఆవరణలో పోటీలకు ఎంపికైన విద్యార్థులను పీడీ కల్యాణ్‌రామ్, వడన్న, ఉపాధ్యాయులు అభినందించారు.

తాయమ్మ గుడిలో హుండీ చోరీ



రైస్‌మిల్లు వెనుక పడి ఉన్న హుండీ

గద్వాల క్రైం, జూలై 11 : జోగుళాంబ గద్వాల జిల్లా కేంద్రంలోని బీరెల్లి రోడ్‌లో ఉన్న తాయమ్మ గుడిలో మళ్లీ దొంగలు పడ్డారు. ఈసారి దొంగలు ఏకంగా హుండీనే ఎత్తుకెళ్లారు. ఈ సంఘటన బుధవారం అర్ధరాత్రి చోటు చేసుకొంది. ఇందుకు సంబంధించి పట్టణ ఎస్సై శ్రీనివాస్ తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. తాయమ్మ గుడిలో పూజలు ముగిసిన తర్వాత బుధవారం సాయంత్రం ఆలయ పూజారి శంకరయ్యస్వామి దేవాలయానికి తాళం వేసి వెళ్లిపోయారు. గురువారం ఉదయం వచ్చి చూసేసరికి బయట తాళం పగులగొట్టబడి ఉండటంతో సమాచారాన్ని కౌన్సిలర్ కుమారుడు సాయిరెడ్డికి తెలిపారు. ఆలయంలోకి ప్రవేశించగా ఏకంగా హుండీనే దొంగలు ఎత్తుకెళ్లారు. దీంతో పోలీసులకు సమాచారం ఇవ్వడంతో సీఐ భీంకుమార్, ఎస్సై శ్రీనివాస్ ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. సీఐ పూజారి నుంచి వివరాలను అడిగి తెలుసుకున్నారు. తర్వాత పోలీస్ సిబ్బందితో ఆ చుట్టుపక్కల పరిసరాలను వెతికించగా దేవాలయానికి కొద్ది దూరంలో ఉన్న రైస్‌మిల్లు వెనుకభాగంలో హుండీలో ఉన్న దాదాపు రూ.లక్ష నగదును తీసుకొని ఖాళీ హుండీని దొంగలు పారేసి వెళ్లారు. దొంగతనం జరిగిన ప్రదేశంలో క్లూస్‌టీంతో పరిశీలించారు. ఇదే దేవాలయంలో ఇలా దొంగతనం జరగడం ఇది నాల్గవసారి అని, పూజారితో పాటు భక్తులు తెలిపారు. పూజారి శంకరయ్యస్వామి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ఇసుక టిప్పర్లను అడ్డుకున్న గ్రామస్థులు

- తాగునీటి పైపులైన్లు ధ్వంసం అవుతున్నాయని నిరసన



అధిక లోడ్‌తో వస్తున్న ఇసుక టిప్పర్లను అడ్డుకున్న అశోక్‌నగర్ గ్రామస్థులు

రాజోలి, జూలై 11 : జోగుళాంబ గద్వాల జిల్లా రాజోలి మండలం అశోక్‌నగర్ గ్రామం మీదుగా అధిక ఇసుక లోడ్‌తో వెళ్తున్న ఇసుక టిప్పర్లను గురువారం గ్రామస్థులు అడ్డుకున్నారు. కొన్ని రోజులుగా టీఎస్ఎండీసీ ఏర్పాటు చేసిన తుమ్మిళ్ల ఇసుక రీచ్ నుంచి స్థాయికి మించి అధిక లోడ్‌తో ఇసుక టిప్పర్లు తుమ్మిళ్ల నుంచి అశోక్‌నగర్ గ్రామం మీదుగా గద్వాల జిల్లాకు వెళ్తున్నాయని దీంతో గ్రామానికి తాగునీరు సరఫరా అయ్యే నీటి పైపు లైన్లపై టిప్పర్లు వెళ్లడంతో పైపులు పగిలిపోయి నీరు వృథా అవుతున్నాయని, తద్వారా తాగునీరు కలుషితం అవుతోందని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయమై పలుమార్లు సంబంధిత కాంట్రాక్టర్లకు చెబుతున్నా వినిపించుకోకపోవడంతో గురువారం మధ్యాహ్నం 15 టిప్పర్లను దాదాపు రెండున్నర గంటల సేపు రోడ్డుపైనే నిలిపివేసి నిరసన వ్యక్తం చేశారు. కాంట్రాక్టర్‌కు సంబంధించిన వ్యక్తులు రెండు రోజుల్లో పైపులైన్లకు మరమ్మతులు చేయించి నీటి సరఫరా జరిగేలా చూస్తామని హామీ ఇవ్వడంతో టిప్పర్లను వదిలేశారు. అయినా అనుమతులకు మించి అధిక లోడ్‌తో ఇసుక టిప్పర్లు వెళ్లడంపై పలు గ్రామాల నుంచి నిరసన సెగలు తగ్గడం లేదు. అధికారులు పర్యవేక్షించి అధిక లోడ్‌లతో వాహనాలు వెళ్లనివ్వకుండా చూడాలని గ్రామస్థులు కోరుతున్నారు. నిరసన కార్యక్రమంలో వెంకటకృష్ణ, శివరాంకృష్ణ, మల్లికార్జునరావు, మహిళలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

జేఎల్ ఫలితాల్లో పీయూ విద్యార్థికి మూడో ర్యాంక్



అఫ్రా నాజ్నీన్‌ను సన్మానిస్తున్న పీయూ రిజిస్ట్రార్, డాక్టర్ మధుసూదన్ రెడ్డి, పీయూ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్.చంద్రకిరణ్, అధ్యాపకులు

పాలమూరు యూనివర్సిటీ, జూలై 11 : ఇటీవల టీజీపీఎస్సీ ద్వారా విడుదలైన జూనియర్ లెక్చరర్ పోస్టుల పరీక్ష ఫలితాలలో పాలమూరు యూనివర్సిటీలో చదువుతున్న పీహెచ్‌డీ విద్యార్థి అఫ్రా నాజ్నీన్‌కు మూడో ర్యాంక్ వచ్చింది. జనరల్ ర్యాంకింగ్ లిస్ట్ (కెమిస్ట్రీ) రాష్ట్ర స్థాయిలో మూడవ ర్యాంక్, మల్టీజోనల్ మొదటి ర్యాంక్ సాధించారు. రాష్ట్ర వ్యాప్తంగా లక్షల మంది పోటీపడిన టీజీపీఎస్సీ పోటీ పరీక్షలో జిల్లా కేంద్రంలోని వీరన్నపేటకు చెందిన మెడికల్ ఆఫీసర్ డాక్టర్ జహీరొద్దీన్ కూతురు అఫ్రా నాజ్నీన్ మొదటి తరగతి నుంచి పీహెచ్‌డీ వరకు అన్నీ మొదటి ర్యాంకులలోనే నిలిచారు. జూనియర్ లెక్చరర్ పోస్టుకు ఎంపిక కానున్న ఆమెను అధ్యాపకులు, కుటుంబ సభ్యులు అభినందించారు. ఇప్పటికే పాలమూరు యూనివర్సిటీలో కెమిస్ట్రీ విభాగంలో మొదటి ర్యాంక్‌లో, పీజీలో గోల్డ్‌మెడల్ సాధించారు. సెట్ క్వాలిఫై అయిన అఫ్రా నాజ్నీన్ పాలమూరు యూనివర్సిటీలో కెమిస్ట్రీ విభాగంలో డాక్టర్ నూర్జహాన్, పర్యవేక్షణలో పీహెచ్‌డీ చేస్తూనే జూనియర్ లెక్చరర్ పోస్టుకు చదివి మూడవ ర్యాంక్ సాధించారు. కష్టపడి చదివి జూనియర్ లెక్చరర్ పోస్టుకు ఎంపికైన అఫ్రా నాజ్నీన్‌ను గురువారం పీయూ రిజిస్ట్రార్ డాక్టర్ మధుసూదన్‌రెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ చంద్రకిరణ్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.కృష్ణయ్య కెమిస్ట్రీ విభాగం అధ్యాపకులు విజయలక్ష్మి సన్మానించారు.

14న ఉమ్మడి జిల్లా స్థాయి తైక్వాండో చాంపియన్‌షిప్

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, జూలై 11 : జిల్లా కేంద్రంలోని పాలమూరు విశ్వవిద్యాలయంలోని ఇండోర్ స్టేడియంలో ఈ నెల 14వ తేదీన ఉమ్మడి జిల్లా స్థాయి ఓపెన్ తైక్వాండో చాంపియన్ కమ్ ఎంపికలు నిర్వహిస్తున్నట్లు మహబూబ్‌నగర్ జిల్లా తైక్వాండో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి జె.బాబులాల్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికైన క్రీడాకారులు ఈ నెల 22, 23వ తేదీల్లో కోట్ల విజయ్‌భాస్కర్‌రెడ్డి ఇండోర్ స్టేడియంలో జరగనున్న తెలంగాణ రాష్ట్రస్థాయి తైక్వాండో చాంపియన్‌షిప్‌లో పాల్గొంటారని పేర్కొన్నారు. ఆసక్తి గల క్రీడాకారులు ఉదయం 9 గంటలకు రిపోర్టు చేయాలని కోరారు.

షటిల్‌బ్యాడ్మింటన్ టీమ్ ఈవెంట్ విజేత

వరంగల్ ఆపరేషన్

- డబుల్స్ విజేత నిజామాబాద్
- సింగిల్స్ విజేత విద్యుత్‌సౌధ (దినేష్‌రెడ్డి)



షటిల్ బ్యాడ్మింటన్ విజేతలతో ఓఎంసీ ట్రాన్స్‌కో ఎస్ఈ వాసుదేవరావు

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, జూలై 11 : జిల్లా కేంద్రంలోని ఇండోర్ స్టేడియంలో జరుగుతున్న టీజీ ట్రాన్స్‌కో, డిస్కమ్ ఇంటర్ సర్కిల్ బ్యాడ్మింటన్ (పురుషుల) చాంపియన్ టోర్నీ ముగిసింది. గురువారం జరిగిన ఫైనల్స్ హోరాహోరీగా జరిగాయి. టీమ్ ఈవెంట్ విభాగంలో జరిగిన మ్యాచ్‌లో వరంగల్ ఆపరేషన్ జట్టు, మెట్రోజోన్ జట్టుపై, డబుల్స్ విభాగంలో నిజామాబాద్ జట్టు, విద్యుత్‌సౌధపై, సింగిల్స్‌లో దినేష్‌రెడ్డి (విద్యుత్‌సౌధ), ప్రవీణ్ (కార్పొరేట్ ఆఫీస్ జట్టు)పై గెలిచి చాంపియన్‌గా నిలిచారు. మూడోస్థానంలో టీమ్ ఈవెంట్‌లో కరీంనగర్ ఆపరేషన్ జట్టు, డబుల్స్‌లో వరంగల్ ఆపరేషన్ జట్టు, సింగిల్స్‌లో కృష్ణకాంత్ (నిజాబాద్ ఆపరేషన్) నిలిచారు.

క్రీడల్లో గెలుపు, ఓటములు సహజం

- ఓఎంసీ ట్రాన్స్‌కో ఎస్ఈ వాసుదేవరావు

క్రీడల్లో గెలుపు, ఓటములు సహజమని, క్రీడాస్ఫూర్తిని చాటాలని ఓంఎసీ ట్రాన్స్‌కో ఎస్ఈ వాసుదేవరావు అన్నారు. టీజీ ట్రాన్స్‌కో, డిస్కమ్ ఇంటర్ సర్కిల్ బ్యాడ్మింటన్ (పురుషుల) చాంపియన్ టోర్నీ ముగింపు కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలతో ఉద్యోగుల్లో ఐక్యత పెంపొందుతుందని, మానసిక ఉల్లాసంతో శారీరక దారుఢ్యం పెంపొందుతుందన్నారు. రెండు రోజులు టోర్నీ ఉత్సాహంగా పాల్గొని విజేతలుగా, రన్నర్‌లుగా నిలువడం అభినందనీయమన్నారు. సంస్థ అభివృద్ధికి మరింత కృషి చేయాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో డీఈలు రమణమూర్తి, ప్రకాష్, స్పోర్ట్స్ ఆఫీసర్ జగ్మనాథం, ఓంఎసీ సర్కిల్ జనరల్ సెక్రటరీ రజనీకాంత్‌రెడ్డి, క్రీడాకారులు పాల్గొన్నారు.

సీఎం సొంత జిల్లాలో గెలిపించారు

- మోదీ సైన్యంలో పనిచేసే అవకాశం కల్పించారు
- జడ్చర్ల, దేవరకద్ర కృతజ్ఞత సభల్లో మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ



జడ్చర్లలో నిర్వహించిన కృతజ్ఞత సభలో మాట్లాడుతున్న మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ

జడ్చర్ల, జూలై 11 : మహబూబ్‌నగర్ పార్లమెంట్ పరిధిలోనే ముఖ్యమంత్రి ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గం ఉందని, అధికార పార్టీ అభ్యర్థి గెలుపుకోసం ఎన్నో కుట్రలు, కుతంత్రాలు, బెదిరింపులకు పాల్పడినా, కేసులు పెట్టి భయాందోళనలకు గురిచేసినా, ప్రలోభాలు పెట్టినా బీజేపి గెలుపును ఆపలేకపోయారని ఎంపీ డీకే అరుణ అన్నారు. దేశ ప్రధాన మంత్రి నరేంద్రమోదీ సైన్యంలో సైనికురాలిగా పనిచేసే అవకాశాన్ని మహబూబ్‌నగర్ పార్లమెంట్ ఓటర్లు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, శ్రేయోభిలాషులు కల్పించారని ఆమె అన్నారు. జడ్చర్ల పట్టణంలోని ప్రేమ్‌రంగా గార్డెన్స్‌లో గురువారం నిర్వహించిన జడ్చర్ల నియోజకవర్గ ఓటరు మహాశయులకు కృతజ్ఞత సభలో పాల్గొన్న సందర్భంగా ఆమె మాట్లాడారు. ఏ పార్టీ అభ్యర్థులు గెలిచినా, అభివృద్ధి అనే లక్ష్యంతోనే పనిచేయాలని జడ్చర్ల ఎమ్మెల్యేకు సూచించారు. కక్షసాధింపు చర్యలకు పోకూడదని, రాజకీయం శాశ్వతం కాదని సూచించారు. లక్ష్యం, కమిట్‌మెంట్‌తో పనిచేస్తే రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలలో బీజేపీ అభ్యర్థులు అత్యధిక స్థానాల్లో గెలిచేవిధంగా ఇప్పటి నుంచే సన్నద్ధం కావాలని పిలుపునిచ్చారు. ప్రధాన మంత్రి నరేంద్రమోదీ నాయకత్వంలో కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు వివరించి, వారిలో చైతన్యం తీసుకురావాలని కోరారు. జిల్లా అభివృద్ధికి శాయశక్తులా కృషి చేస్తానన్నారు. పార్టీ కోసం విశేషంగా పనిచేసిన బూత్‌స్థాయి కార్యకర్తలకు, వివిధ సంఘాల నాయకులకు శాలువాలు కప్పి సన్మానించారు. అంతకుముందు జడ్చర్ల క్రాస్‌రోడ్డు నుంచి ప్రేమ్‌రంగా గార్డెన్స్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు కేవీఎల్ఎన్ రెడ్డి, అజయ్, పద్మజారెడ్డి, బురుజు రాజేందర్‌రెడ్డి, బాలకృష్ణ, ముచ్చర్ల కృష్ణయ్య, సామల నర్సిములు, బాలవర్ధన్‌గౌడ్, రాపోతుల శ్రీనివాస్‌గౌడ్, శ్రీనివాస్‌రెడ్డి, సాహితిరెడ్డి, సామ నాగరాజు, రమేశ్‌జీ పాల్గొన్నారు.

మోదీతోనే అభివృద్ధి సాధ్యం

దేవరకద్ర : మన దేశం మరింత అభివృద్ధి చెందాలంటే అది మన నరేంద్రమోదీతోనే సాధ్యమని మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ అన్నారు. ఎంపీగా విజయం సాధించిన తర్వాత దేవరకద్రకు మొదటిసారి రావడంతో గురువారం మండల కేంద్రంలోని నియోజకవర్గ ఇన్‌చార్జి కొండ ప్రశాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో కృతజ్ఞత సభ నిర్వహించారు ముందుగా ఆంజనేయస్వామి దేవాలయంలో డీకే అరుణ ప్రత్యేక పూజలు చేశారు. కార్యకర్తలు, నాయకుల ఆధ్వర్యంలో బైక్ ర్యాలీతో స్వాగతం పలికారు. ఉమ్మడి పాలమూర్ జిల్లా అభివృద్ధికి సీఎం రేవంత్ రెడ్డికి ఎంత బాధ్యత ఉందో అంతే బాధ్యత తనకూ ఉందని అన్నారు. దేవరకద్రలో అండర్ పాస్ బ్రిడ్జి నిర్మాణం కోసం కృషి చేస్తానన్నారు. పార్లమెంట్ కన్వీనర్ డోకుర్ పవన్‌కుమార్‌రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యరాలు పద్మజారెడ్డి, రాష్ట్ర నాయకులు ఎగ్గని నర్సిములు యజ్ఞ భూపాల్ రెడ్డి, జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు కృష్ణంరాజు, రవీందర్‌రెడ్డి మండల నాయకులు దేవయ్య, నారాయణరెడ్డి, శేఖర్, సాయిరాజు, నరేష్ కుమార్, రాజు, ఆంజనేయులు, రవి, మణిదీప్, రాజు, రాము పాల్గొన్నారు.

బాలికపై అత్యాచారం : కేసు నమోదు

వనపర్తి రూరల్, జూలై 11 : బాలికపై అత్యాచారం చేసిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు రూరల్ ఎస్ఐ జలంధర్ రెడ్డి తెలిపారు. వనపర్తి మండలంలోని ఓ గ్రామానికి చెందిన ఆంజనేయులు అదే గ్రామానికి చెందిన 12 ఏళ్ల బాలికపై అత్యాచారం చేశాడని బాలిక కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

గొర్రెల దొంగలు అరెస్టు

ఆత్మకూరు, జూలై 11 : గత నెల 29వ తేదీన మోట్లంపల్లి గ్రామ శివారులోని వెంకటేశ్వరమ్మ మణివర్ధన్ రెడ్డిల షెడ్డులో దొంగలు 18 గొర్రె పొట్టేళ్లు దోచుకెళ్లిన సంఘటనలో బాధితులు స్థానిక స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు విచారణలో ఉండగా గురువారం మధ్యాహ్నం ఆత్మకూరు పట్టణంలోని జూరాల ఎక్స్ రోడ్డు వద్ద ఆత్మకూరు ఎస్ఐ నరేందర్ వారి సిబ్బందితో వాహనాల తనిఖీ చేస్తుండగా ఒక ఆటోలో ఉన్న నలుగురు వ్యక్తులు పోలీసులను చూసి పారిపోతున్నారు. ఈ క్రమంలో వారిని పట్టుకొని విచారించగా ఆంధ్రప్రదేశ్‌లోని నంద్యాల జిల్లా పగిడ్యాల గ్రామానికి చెందిన ఎరుకలి రాజు, చిన్న మద్దిలేటి, గున్నిద్దుల మల్లికార్జున ఎరుకలి హరికృష్ణగా గుర్తించారు. ఈనెల 29వ తేదీన మోట్లంపల్లి గ్రామ శివారులోని గొర్రెల దొంగతనం చేసింది మేమే అని ఒప్పుకున్నారు. మరొక నిందితుడు ఎరుకలి పోషన్న పరారీలో ఉన్నాడని తెలిపారు. పై నలుగురు నిందితుల నుంచి ఒక మహీంద్రా ఆటో, డీలక్స్ బైక్, 90వేల నగదు స్వాధీనం చేసుకుని ఆత్మకూరు మెజిస్ట్రేట్ ముందు హాజరు పరిచి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ శివకుమార్, ఎస్ఐ నరేందర్‌లు తెలిపారు.

'ఖాళీ స్థలం కనిపిస్తే కబ్జా'

మహబూబ్‌నగర్, జూలై 11 : పట్టణంలో ఎక్కడ ఖాళీ స్థలం కనిపించినా కొందరు భూములను కబ్జా చేస్తున్నారని, వీరిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కన్స్యూమర్ అవేర్‌నెస్ ప్రొటెక్షన్ అండ్ వెల్ఫేర్ సొసైటీ ఉమ్మడి పాలమూరు అధ్యక్ష, కార్యదర్శులు ఆక్యపోకు ఆడమ్స్, శేరి వెంకటరెడ్డిలు గురువారం డీఎస్పీ వెంకటేశ్వర్లుకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాలకొండ-మర్లు సర్వే నెంబర్ 38/4లో గతంలో ప్లాట్లు కొనుగోలు చేసిన వ్యక్తుల హద్దురాళ్లను తొలగించి గుర్తుపట్టకుండా మళ్లీ హద్దురాళ్లు పాతి, రంగులు మార్చి ఇతరులకు విక్రయిస్తున్నారని పేర్కొన్నారు. అసలు యజమానులు అక్కడికి వెళితే మీ ప్లాట్లు ఇక్కడ లేవు, మరోచోట ఉన్నాయని చెబుతూ బుకాయించే ప్రయత్నం చేస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఇద్దరు, ముగ్గురు వ్యక్తులు ఆ ప్రాంతంలో గ్రూపుగా అక్కడ ఎక్కడా ఖాళీ ప్రదేశం ఉన్న అక్కడ హద్దురాళ్లను మార్చి ఇష్టానుసారంగా ఇతరులకు విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారని పేర్కొన్నారు. దీనిపై సమగ్ర విచారణ చేసి అక్రమాలకు పాల్పడే ముఠాపై చర్యలు తీసుకుని బాధితులకు న్యాయం చేయాలని కోరారు.

గద్వాలను సందర్శించిన ట్రైనీ కలెక్టర్లు

- కలెక్టర్‌తో సమావేశం



కలెక్టర్ బీఎం.సంతోష్‌తో సమావేశమైన ట్రైనీ కలెక్టర్లు

గద్వాల న్యూటౌన్, జూలై 11 : తెలంగాణ దర్శన్‌లో భాగంగా గురువారం జోగుళాంబ గద్వాల జిల్లాను ట్రైనీ కలెక్టర్లు సందర్శించారు. తెలంగాణ రాష్ట్రానికి కేటాయించబడిన 2023 బ్యాచ్‌కు చెందిన ట్రైనీ కలెక్టర్లు అయిన వికారాబాద్ జిల్లాకు చెందిన ఉమాహారతి, నిజామాబాద్‌కు చెందిన అజ్మీర సంకేత్‌కుమార్, నారాయణపేటకు చెందిన గరిమ నరుల, ఆదిలాబాద్‌కు చెందిన అభిగ్యాన్ మాల్వియా, కరీంనగర్‌కు చెందిన అజయ్‌యాదవ్, ఖమ్మంకు చెందిన మృనాల్ శ్రేష్ట, సంగారెడ్డికి చెందిన మనోజ్‌లు జోగుళాంబ గద్వాల జిల్లాను శిక్షణలో భాగంగా సందర్శించారు. జిల్లాకు చేరుకున్న ట్రైనీ కలెక్టర్లు ముందుగా జోగుళాంబ అమ్మవారి ఆలయాన్ని సందర్శించారు. అనంతరం నేరుగా కలెక్టరేట్‌కు చేరుకొని కలెక్టర్ బీఎం.సంతోష్‌తో కలిసి జిల్లాలో అమలవుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల విషయాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం జిల్లా కేంద్రంలోని రాఘవేంద్ర కాలనీలో చేనేత కార్మికులను కలిసి చేనేత మగ్గాలు, వస్త్రాల తయారీ విధానాన్ని పరిశీలించారు. బట్టల తయారీ చేసే విధానాన్ని అడిగి తెలుసుకున్నారు. చేనేత వస్త్రాల దుకాణాన్ని సందర్శించారు. కార్యక్రమంలో చేనేత, జౌళిశాఖ సహాయ సంచాలకులు, గోవిందయ్య, తహసీల్దార్ వెంకటేశ్వర్లు ఉన్నారు.

జోగుళాంబ అమ్మవారి సేవలో శిక్షణా ఐఏఎస్‌లు

అలంపూరు : దక్షిణకాశీ ఐదవ శక్తిపీఠం జోగుళాంబ బాలబ్రహ్మేశ్వర స్వామిని తెలంగాణ రాష్ట్ర శిక్షణా ఐఏఎస్‌లు, నోడల్ అధికారి ట్రైనింగ్ అధికారి ఎంసీహెచ్ డాక్టర్ శ్రీనివాసులు గురువారం దర్శించుకున్నారు. ఈవో పురేందర్ కుమార్, ప్రధాన అర్చకుడు ఆనంద్‌శర్మ పూర్ణకుంభ స్వాగతం పలికి స్వామివారి ఆలయంలో గణపతి పూజ, అభిషేకాలు, అమ్మవారి ఆలయంలో విశేష పూజలు చేసి తీర్థ ప్రసాదాలను అందించారు. తహసీల్దార్ మంజుల, ఆర్ఐ మాసుం పాల్గొన్నారు.

మొలకెత్తి మురుగుతున్న మొక్కజొన్న

- నవాబ్‌పేట మండలం రుద్రారంలో ఘటన



మొలకలను పరిశీలిస్తున్న ఏడీ ఆంజనేయులు

నవాబ్‌పేట, జూలై 11 : పంట బాగా వస్తుందని పక్కపొలం రైతులు చెబితే నమ్మి విత్తనాలు నాటిన రైతుకు మొలకెత్తిన కొద్ది కాలంలోనే మొలకలు మురిగిపోతుండటం ఆ రైతును కలవరపెడుతున్నది. ఈ సంఘటన మండలంలోని రుద్రారం గ్రామంలో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన కావలి పెంటయ్య అనే రైతు తన వ్యవసాయ పొలంలో సుమారు నాలుగు ఎకరాల్లో రూ.లక్ష వెచ్చించి నెల రోజుల క్రితం మండల కేంద్రంలోని ఓ ప్రైవేట్ షాపులో తీసుకువచ్చిన మొక్కజొన్న విత్తనాలు నాటాడు. కొద్ది కాలంలోనె మొలకలు రావడంతో సదరు రైతు సంతోష పడ్డాడు. వారం రోజులుగా మొలకలు మురిగిపోతుండటంతో ఆందోళన చెంది సదరు కంపెనీ డీలర్‌ను నిలదీయగా కంపెనీ ప్రతినిధులను గురువారం రుద్రారం గ్రామానికి పంపించారు. విషయం తెలుసుకున్న ఏడీఏ ఆంజనేయులు, ఏవో కృష్ణ కిషోర్‌లు అక్కడకు చేరుకుని మురిగిన మొలకలను పరిశీలించగా భూమిల లోపం వల్లె ఇలా జరిగి ఉంటుందని అనుమానం వ్యక్తం చేశారు. నకిలీ విత్తనాలుగా పరిగణించలేమన్నారు. ఈ సందర్భంగా రైతు పెంటయ్య మాట్లాడుతూ తను వేల రూపాయలు పెట్టుబడి పెట్టి విత్తనాలు తీసుకువచ్చి పంటసాగు చేస్తే మొలకలు మురిగిపోతున్నాయని, తనకు న్యాయం చేయాలని, లేదంటే కలెక్టర్, ఇతర అధికారులకు ఫిర్యాదు చేస్తానని తెలిపారు.

సహకార సంఘాలు రైతు అభివృద్ధికి జీవనాడులు

- ఐఎఫ్ఎఫ్‌సీవో రాష్ట్ర మార్కెటింగ్ మేనేజర్ ఎంఆర్.కృపాశంకర్
- అయిజలో పీఏసీఎస్ పరిశీలన



సూపర్ మార్కెట్‌ను పరిశీలిస్తున్న రాష్ట్ర మార్కెటింగ్ మేనేజర్

అయిజ, జూలై 11 : రైతు సహకార సంఘాలు రైతుల అభివృద్ధికి జీవనాడులని ఇండియన్ ఫార్మర్స్ ఫర్టిలైజర్ కో-ఆపరేటివ్ లిమిటెడ్(ఐఎఫ్ఎఫ్‌సీవో) తెలంగాణ రాష్ట్ర మార్కెటింగ్ మేనేజర్ ఎంఆర్.కృపాశంకర్ అన్నారు. వ్యాపార విస్తరణలో భాగంగా గురువారం జోగుళాంబ గద్వాల జిల్లా అయిజ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాన్ని ఆయన పరిశీలించారు. సంఘం ఆధ్వర్యంలో అధ్యక్షుడు పోతుల మధుసూదన్‌రెడ్డి రైతులకు ఎరువుల, పురుగుల మందులను నాణ్యమైన, సరసమైన ధరలకు విక్రయించటమే కాకుండా మండలంలోని ప్రధాన ప్రాంతాల్లో వీటి దుకాణాలను ఏర్పాటు చేసి రైతులకు అందుబాటులో ఉంచటం అభినందించదగ్గ విషయమన్నారు. ప్రజలకు నాణ్యమైన నిత్యావసర సరుకులను సరసమైన ధరలకు విక్రయిస్తూ సంఘం ఆదాయం పెంచడమే కాకుండా ఉద్యోగతను కల్పిస్తున్నారని తెలిపారు. భారతదేశంలో మొదటిసారిగా నానో యూరియా, డీఏపీ లాంటి లిక్విడ్ ఫర్టిలైజర్‌ను అందించిన ఘనత ఇఫ్కో సంస్థకు చెందుతుందని వివరించారు. అయిజ సింగిల్ విండో ఆధ్వర్యంలో పంటలకు పిచికారి చేయడానికి డ్రోన్లు ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఈ డ్రోన్ల ద్వారా పంటకు పిచికారి చేస్తే నేరుగా మొక్కకు చేరుతుందని పేర్కొన్నారు. రైతులకు నానో ఫర్టిలైజర్, సేంద్రియ ఎరువులపై అవగాహన కల్పించేందుకై త్వరలో అయిజ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో రైతు అవగాహన సదస్సును తమ ఇఫ్కో సంస్థ ద్వారా ఏర్పాటు చేస్తామన్నారు. జిల్లా ఫీల్డ్ ఆఫీసర్ గురురాజ్, అసిస్టెంట్ నరేష్ ఉన్నారు.

వ్యాపారి ఇంట్లో దొంగతనం

లింగాల, జూలై 11 : మండల కేంద్రమైన లింగాలలో వ్యాపారి మాకం చిన్నరాములు ఇంటిలో దొంగతనం జరిగిన సంఘటన గురువారం ఆలస్యంగా వెలుగుచూసింది. వివరాలు ఈ విధంగా ఉన్నాయి. ఈ నెల 9న కుటుంబ సభ్యులు ఇంటికి తాళం వేసి హైదరాబాదుకు వెళ్లారు. కాగా ఎదురింటి వారు ఇంటి మొదటి అంతస్తు తలుపు తెరిచి ఉండడాన్ని గమనించి ఇంటి యజమానికి సమాచారం అందించారు. దీంతో చోరీ జరిగినట్లు వెలుగు చూసింది. దొంగలు ఇంటి ప్రధాన ద్వారానికి ఉన్న తాళాన్ని పగులగొట్టి ఇంట్లో ఉన్న బీర్వాలను సైతం పగులగొట్టి సోదాలు చేశారు. దొంగలురూ.5వే నగదు, బంగారు కమ్మలు ఎత్తుకెళ్లినట్లు ఎస్సై తెలిపారు. సమాచారం అందుకున్న ఎస్సై జగన్‌మోహన్ సంఘటన స్థలాన్ని పరిశీలించారు. క్లూస్‌టీంను రప్పించి ఆనవాళ్లను తీసుకున్నారు. ఇంటి యజమాని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

కనుల పండువగా సీతారామ కల్యాణం



సీతారామ కల్యాణం నిర్వహిస్తున్న వేద పండితులు

నాగర్‌కర్నూల్ టౌన్, జూలై 11: నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో చేపట్టిన శ్రీకృష్ణ కాలచక్రం 83వ విశ్వశాంత మహాయాగంలో భాగంగా 5వ రోజు గురువారం ధన్వంతరి హోమం, సీతారామ కల్యాణ మహోత్సవం నిర్వహించారు. శ్రీకృష్ణ పీఠాధిపతి కృష్ణజ్యోతి స్వరూపానంద స్వామీజీ ఆధ్వర్యంలో ఉదయం గోపూజ, తులసి పూజ, రుద్రాభిషేకాలు నిర్వహించారు. మధ్యాహ్నం వేద పండితుల మంత్రోచ్ఛారణల మధ్య భక్తులు సామూహిక శ్రీలక్ష్మీ కుబేర సహిత ధన్వంతరి హోమాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మరోవైపు శ్రీలక్ష్మీ కుబేరస్వామికి పండితుల విశేష పూజలతో మహిళా భక్తుల చేత సామూహిక కుంకుమార్చన, విష్ణు సహస్రనామం, లలితా సహస్రనామ పారాయణం చేశారు. నిత్య కార్యక్రమాల్లో భాగంగా ప్రత్యేక మండపాల్లో వేద పండితులు జప పారాయణం చేస్తూ హోమాలు నిర్వహించారు. సాయంత్రం సీతారామ కల్యాణ మహోత్సవాన్ని కనుల పండువగా నిర్వహించారు. వేడుకల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని తిలకించారు. యాగ మహోత్సవంలో పాల్గొన్న భక్తులందరికీ ఉదయం, రాత్రి అల్పాహారం మధ్యాహ్నం అన్న ప్రసాద పంపిణీ చేశారు. శుక్రవారం ఉదయం శ్రీలక్ష్మీ సహిత చండీ హోమాలు, సాయంత్రం చండీ అమ్మవారికి అభిషేకం, లక్ష కుంకుమార్చన నిర్వహించనున్నారు.

ఆభరణాల కోసం ఖననం చేసిన గుంతను తవ్విన ఘనుడు

- నిలువరించిన పోలీసులు

లింగాల, జూలై 11 : ఆభరణాల కోసం మృతదేహాన్ని ఖననం చేసిన గుంతను తవ్వడానికి ప్రయత్నం చేసిన సంఘటన గురువారం నాగర్‌కర్నూల్ జిల్లా లింగాల మండల పరిధిలోని కొత్తకుంటపల్లి శివారులో చోటు చేసుకుంది. గ్రామస్థులు తెలిపిన వివరాలు ఈ విధంగా ఉన్నాయి. గత ఏడాది క్రితం గ్రామానికి చెందిన మృతురాలు లింగమ్మ మృతి చెందింది. ఆ సమయంలో మృతురాలి కాళ్లకు, ముంజేతులకు వెండి ఆభరణాలు ఉండడం వాటితోనే ఆమెను ఖననం చేశారు. కాగా ఏడాది తర్వాత మృతురాలి మనువడు తిరుపతయ్య ఆమెను గుర్తు చేసుకొని తాగిన మైకంలో ఆభరణాలు ఉన్నట్లు వాటిని తీసుకొనేందుకు మృతదేహాన్ని ఖననం చేసిన గుంతను తవ్వేందుకు పూనుకున్నాడు. ఈ విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడికి వెళ్లి అడ్డు తగిలి తిరిగి గుంతను పూడ్చించారు.

ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

మహబూబ్‌నగర్ అర్బన్, జూలై 11 : తెలంగాణ రాష్ట్ర మైనార్టీ స్టడీ సర్కిల్, రాష్ట్ర మైనా రిటీస్ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మైనార్టీ నిరుద్యోగ యువతకు టీజీపీఎస్‌టీ గ్రూప్-1 మెయిన్స్ కోసం ఉచిత శిక్షణకు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ అధికారి ఆర్.ఇందిర గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్‌లోని రాష్ట్ర మైనార్టీ స్టడీ సర్కిల్‌లో కోచింగ్ ఉంటుందని, ఆసక్తి గల అభ్యర్థులు ఈ నెల 19వ తేదీలోపు రాష్ట్ర మైనార్టీ స్టడీ సర్కిల్ పేరున దరఖాస్తు చేసుకోవాలన్నారు.

ఆపరేషన్ ముస్కాన్ పకడ్బందీగా నిర్వహించాలి

- ఇన్‌చార్జి కలెక్టర్ సంచిత్ గంగ్వార్



అధికారులతో మాట్లాడుతున్న ఇన్‌చార్జి కలెక్టర్ సంచిత్ గంగ్వార్

వనపర్తి రాజీవ్‌చౌరస్తా, జూలై 11: జిల్లాలో చేపట్టిన ఆపరేషన్ ముస్కాన్ కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలని ఇన్‌చార్జి కలెక్టర్ సంచిత్ గంగ్వార్ అధికారులకు సూచించారు. బాల కార్మికులు ఉన్నట్లు గుర్తిస్తే కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. గురువారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో జిల్లా సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఆపరేషన్ ముస్కాన్, పోక్సో కేసులపై జిల్లా స్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి కలెక్టర్ మాట్లాడుతూ.. హోటల్స్, కిరాణం షాపులు, ఇటుక బట్టి, పత్తి చేళ్లల్లో ఎక్కడైనా బడీడు పిల్లలు పని చేస్తు ఉంటే రెస్క్యూ చేయాలని సూచించారు. పిల్లల చేత ఎక్కడైనా వెట్టిచాకిరి చేయిస్తున్నట్లు తెలిస్తే కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రెస్క్యూ చేసిన పిల్లలకు వారి తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇచ్చి పిల్లలను విద్యా సంస్థలలో చేర్పించాలని సూచించారు. చైల్డ్ కేర్ సెంటర్లలో దోమలు వ్యాప్తి చెందకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. డ్రై డే కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలని పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. పోక్సో కేసులపై చర్చిస్తు బాధితులకు నిబంధనల ప్రకారం అందాల్సిన పరిహారం సకాలంలో అందించే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా సంక్షేమ అధికారి లక్ష్మీబాయి, విద్యాశాఖ నుంచి ఏడీ నరహరి, హెల్త్ నుంచి పరిమళ, ఆర్‌డీఎస్ స్వచ్ఛంద సంస్థ నుంచి చిన్నమ్మ థామస్, డీసీపీవో రాంబాబు, సీడబ్ల్యూసీ మెంబర్ వనజ కుమారి, పోలీస్ శాఖ నుంచి రవి ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

డబ్బులు వసూలు చేస్తే చర్యలు

ఖిల్లాఘణపురం, జూలై 11: మండల కేంద్రంలోని సీహెచ్‌సీలో రోగుల వద్ద డబ్బులు వసూలు చేస్తే చర్యలు తప్పవని సీహెచ్‌సీ వైద్యాధికారి ఫుల్లారెడ్డి హెచ్చరించారు. సీహెచ్‌సీలో ప్రసవానికి వచ్చే మహిళల వద్ద అవుట్ సోర్సింగ్ సిబ్బంది డబ్బులు వసూలు చేస్తున్నారని ఫిర్యాదులు అందడంతో గురువారం ఆయన ఆసుపత్రి ఆవరణలో ఔట్‌సోర్సింగ్ వైద్య సిబ్బందిని విచారించారు. తప్పు చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆసుపత్రికి బుధవారం కాన్పు కోసం వచ్చిన మహిళా బంధువులు కాన్పు అనంతరం ఇష్టపూర్వకంగా సిబ్బందికి రూ.500 ఇచ్చినట్లు వైద్యాధికారికి రాతపూర్వకంగా వివరణ ఇచ్చినట్లు తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్య సేవలు ఉచితంగా అందిస్తామని ఎట్టి పరిస్థితుల్లో సిబ్బందికి డబ్బులు ఇవ్వరాదని రోగులకు అవగాహన కల్పించారు. ఆసుపత్రికి వచ్చే రోగులను సిబ్బంది అవహేళనగా మాట్లాడితే వైద్యులకు ఫిర్యాదు చేయాలని తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ రాఘవులు తదితరులు పాల్గొన్నారు.

కృత్యాధార పద్ధతిలో బోధించాలి



ఇంగ్లిష్ బోధించే ఉపాధ్యాయుల శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న డీఈవో

వనపర్తి రూరల్, జూలై 11: విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో కృత్యాధార పద్ధతిలో బోధించాలని ఉపాధ్యాయులకు సూచించారు. గురువారం వనపర్తి పట్టణంలోని జిల్లా బాలికల ఉన్నత పాఠశాలలో జాలి ఫోనిక్స్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఒకటో తరగతి ఇంగ్లిష్ బోధించే ఉపాధ్యాయులకు శిక్షణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డీఈవో గోవిందరాజులు మాట్లాడుతూ... ఒకటో తరగతి చదివే విద్యార్థులకు కృత్యాధార పద్ధతిలో బోధించడం వల్ల ఇంగ్లిష్ భాషపైన ఉచ్చారణ, స్పెల్లింగ్, రీడింగ్, రైటింగ్ సులభ పద్ధతిలో నేర్చుకుంటారని అన్నారు. విద్యార్థులు చిన్నప్పటి నుంచే ఇంగ్లిష్ పైన పట్టు సాధిస్తే భవిష్యత్తులో ఉన్న శిఖరాలను అధిరోహిస్తారని అన్నారు. అనంతరం ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేస్తామన్నారు. కార్యక్రమంలో ఏఎంవో మహానంది, జాలి ఫోనిక్స్ స్వచ్ఛందసంస్థ అధికారులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జనం గుండెల్లో నిలిచే వారే నిజమైన నాయకులు

వనపర్తి రాజీవ్ చౌరస్తా, జూలై 11: జనానికి అండగా నిలిచిన వారే నిజమైన నాయకులని సాహితీ కళావేదిక జిల్లా అధ్యక్షుడు పలుస శంకర్ గౌడ్ అన్నారు. జిల్లా పరిషత్ వైస్ చైర్మన్‌గా బాధ్యతలు నిర్వహించి ఇటీవల పదవీ విరమణ చేసిన గుండ్రాతి వామన్ గౌడ్‌ను సాహితీ కళావేదిక ప్రతినిధులు గురువారం వనపర్తిలో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా శంకర్‌గౌడ్ మాట్లాడుతూ... ప్రజాప్రతినిధిగా ప్రజలకు ఉత్తమ సేవలు అందించిన వారిని ప్రజలు ఎప్పటికీ మర్చిపోరని తెలిపారు. అలాంటి వారు పది కాలాల పాటు జనం మదిలో నిలిచి ఉంటారని అందులో వామన్ గౌడ్ ఒకరని అన్నారు. అనంతరం కళావేదిక సభ్యులు ఆయనను శాలువా, పూలమాల జ్ఞాపికలతో సత్కరించారు. కార్యక్రమంలో సాహిత్య కళావేదిక ప్రతినిధులు బైరోజు చంద్రశేఖర్, కంటే నిరంజనయ్య, రంగయ్య గౌడ్, నాయకంటి నరసింహ శర్మ, గంధం నాగరాజు, బండారు శ్రీనివాస్, స్వామి, బుచ్చిబాబు తదితరులు పాల్గొన్నారు.

నీటి పారుదల పితామహుడు నవాబ్ అలీ

- ప్రజా వాగ్గేయకారుడు రాజారాం ప్రకాష్

వనపర్తి టౌన్, జూలై 11: దేశంలో అనేక భారీ నీటిపారుదల ప్రాజెక్టులకు రూపకల్పన చేసిన నవాబ్‌అలీ నవాజ్‌జంగ్ నీటిపారుదల పితామహుడు అని ప్రజా వాగ్గేయకారుడు రాజారాం ప్రకాష్ అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని పాలిటెక్నిక్ కళాశాల మైదానంలో నవాబ్‌అలీ నవాజ్‌జంగ్ బహదూర్ జయంతిని టీజేఏసీ నాయకులు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నవాబ్‌అలీ నవాజ్ జంగ్ జయంతిని తెలంగాణ ఇంజనీర్స్‌డేగా జరుపుకోవడం ఇంజనీర్ల గొప్పతనానికి స్ఫూర్తి దాయకమన్నారు. కార్యక్రమంలో టీజేఏసీ నాయకులు గిరిరాజాచారి, నాయికంటి నరసింహశర్మ, గంధం నాగరాజు, పెండెం నాగన్న యాదవ్, బాలేమియా, కావలి బాలస్వామి నాయుడు, కొమ్ము వెంకటస్వామి, దప్పు స్వామి, మల్లెపు నరసింహ తదితరులు పాల్గొన్నారు.

అమ్మ పేరుతో ప్రతీ ఒక్కరు మొక్కలు నాటాలి

- బీజేపీ జిల్లా అధ్యక్షుడు నారాయణ

వనపర్తి అర్బన్, జూలై 11: ప్రధానమంత్రి నరేంద్రమోదీ పిలుపుమేరకు అమ్మ పేరుతో ప్రతీ ఒక్క బీజేపీ కార్యకర్త మొక్కలు నాటాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు నారాయణ పిలుపునిచ్చారు. గురువారం జిల్లా కేంద్రంలోని నాలుగో వార్డులో పార్టీ కార్యకర్త సూగూరు రాములు ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. ఆయన మాట్లాడుతూ... రోజు రోజుకు పర్యావరణం కలుషితం అవుతుందని, పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతీ ఒక్కరు మొక్కలు నాటాలన్నారు. భూ భాగంలో 33 శాతం పచ్చదనం ఉంటేనే వాతావరణం సమతుల్యమవుతుందని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ లోక్‌నాథ్‌రెడ్డి, ఓబీసీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి శ్రీశైలం, జిల్లా ఉపాధ్యక్షుడు బండారు కుమారస్వామి, పట్టణ అధ్యక్షుడు బచ్చు రాము, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులలో కనీస సామర్థ్యాలను పెంపొందించాలి

- ఆర్‌జేడీ ఉషారాణి

పెద్దమందడి, జూలై 11: విద్యార్థులలో కనీస సామర్థ్యాలు పెంపొందించే విధంగా బోధన ఉండాలని రాష్ట్ర పరిశీలకురాలు, ఆర్‌జేడీ ఉషారాణి అన్నారు. గురువారం మండలంలోని వెల్టూరు సీపీఎస్ పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. విద్యార్థుల సంఖ్యను పెంచాలని సూచించారు. వినూత్న పద్ధతిలో కృత్యధారంగా బోధన చెపట్టాలని ఉపాధ్యాయులకు సూచించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం భాగ్యలక్ష్మి, ఉపాధ్యాయురాలు ఉష తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఎంపీ బండి సంజయ్ జన్మదిన వేడుకలు

అమరచింత, జూలై 11: కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్ జన్మదిన వేడుకలను బీజేపీ ఆధ్వర్యంలో గురువారం సాయంత్రం అమరచింతలో ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా పట్టణంలోని బీజేపీ జెండాకట్ట వద్ద కేక్ కట్ చేసి మిఠాయిలు పంచుకున్నారు. కార్యక్రమంలో బీజేపీ నగర శాఖ అధ్యక్షుడు క్యామ భాస్కర్, బీజేపీ జిల్లా కార్యదర్శి అశోక్ కుమార్, రవి కుమార్, ఎస్సీ నాయకులు అర్జున్ కుమార్, నరాల సిద్ధ రాములు, రాకేష్ శెట్టి, నారాయణ రెడ్డి, కొల్లంపల్లి ఆంజనేయులు, గొల్ల శ్రీనివాసులు, క్యామ భరత్, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని మోకాళ్లపై కూర్చొని కౌన్సిలర్ నిరసన

అమరచింత, జూలై 11: సమస్యల పరిష్కరించాలని మునిసిపల్ కార్యాలయం ముందు గురువారం నాలుగో వార్డు కౌన్సిలర్ సింధు మోకాళ్లపై కూర్చొని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. తమ కాలనీలో కబ్జాకు గురైన రహదారి గురించి అనేకసార్లు మునిసిపల్ కమిషనర్‌కు వినతిపత్రం ఇచ్చినా ఏమాత్రం అధికారులు స్పందించడం లేదని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మునిసిపల్ కమిషనర్ నూరుల్ నజీబ్ ఆమె వద్దకు వచ్చి ఆమెను కార్యాలయంలోకి పిలుచుకొని వినతిపత్రం తీసుకున్నారు. సమస్య పరిష్కారం అయ్యే వరకు పోరాడుతానని కౌన్సిలర్ సింధు పేర్కొన్నారు.

సబ్సిడీ రుణాల జాడేదీ?

- **నాలుగేళ్లుగా నిలిచిపోయిన ఎస్సీ కార్పొరేషన్ రుణాలు**
- **2020-21 ఆర్థిక సంవత్సరం రుణాలకు ఇప్పటికీ లభించని మోక్షం**
- **ఉపాధి లేక వలస బాట పడుతున్న దళిత యువకులు**



షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ కార్యాలయం

వనపర్తి రాజీవ్‌చౌరస్తా, జూలై 11: ఉపాధి లేక ఆర్థిక సమస్యలతో సతమతమవుతున్న నిరుద్యోగ యువతను ఆదుకునేందుకు ప్రభుత్వం అందించాల్సిన సబ్సిడీ రుణాలు నాలుగేళ్లుగా నిలిచిపోయాయి. బీఆర్‌ఎస్ ప్రభుత్వం దళితబంధు పథకం పేరుతో సబ్సిడీ రుణాలను మరిపించింది. దళితబంధు పథకమైనా అర్హులకు అందిందా అంటే అదీలేదు. దీంతో నిరుద్యోగ యువత ఉపాధి కోసం పట్టణాలకు వలసలు వెళ్లే పరిస్థితులు ఏర్పడ్డాయి. కాంగ్రెస్ ప్రభుత్వం త్వరలో ప్రవేశ పెట్టే తొలి ఆర్థిక బడ్జెట్లో ఎస్సీ కార్పొరేషన్ రుణాలు అందించేందుకు నిధులు మంజూరు చేయాలని దళిత నిరుద్యోగ యువత ఆశగా ఎదురుచూస్తున్నారు.

ఇంటర్వ్యూలు పూర్తయినా అందని రుణాలు

2020-21 ఆర్థిక సంవత్సరంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం చివరిసారిగా ఎస్సీ కార్పొరేషన్ ద్వారా సబ్సిడీ రుణాలు అందించేందుకు నోటిఫికేషన్ జారీ చేసింది. ఇందుకోసం వనపర్తి జిల్లాలో 424 యూనిట్ల రుణాలు మంజూరు చేసేందుకు అధికారులు దరఖాస్తులు స్వీకరించి ఇంటర్వ్యూలు కూడా పూర్తి చేశారు. ఇందులో స్కిల్డ్ విభాగంలో 219 మందిని ఎంపిక చేయగా అన్‌స్కిల్డ్ విభాగంలో 205 మందికి రుణాలు అందించేందుకు ప్రక్రియ పూర్తి చేసి ప్రభుత్వానికి అందించారు. కానీ ఈ ప్రక్రియ పూర్తయి నాలుగేళ్లు అవుతున్నా ప్రభుత్వం నుంచి మాత్రం లబ్ధిదారులకు ఆర్థిక సాయం అందలేదు. గత అసెంబ్లీ ఎన్నికల ముందు బీఆర్‌ఎస్ ప్రభుత్వం దళిత బంధు అందిస్తామని హడాబుడిగా దరఖాస్తులు తీసుకుని వదిలేసింది. బీఆర్‌ఎస్ హయాంలో నాలుగేళ్ల కాలంలో ఒక్కరికి కూడా సబ్సిడీ రుణాలు అందించలేదు. దీంతో నిరుద్యోగ యువకులు ఉపాధి దొరకక ప్రభుత్వం నుంచి రుణాలు అందక పట్టణాలకు వలస వెళ్లిపోతున్నారు.

త్వరలోనే పెండింగ్ నిధులు జమ కావచ్చు

కార్పొరేషన్ రుణాల కోసం ఇది వరకు ఇంటర్వ్యూలు పూర్తి చేసుకున్న నిరుద్యోగ దళిత యువకులకు నిధులు మంజూరు కావాల్సి ఉంది. ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి కూడా తీసుకువెళ్లాం. త్వరలోనే పెండింగ్ నిధులు లబ్ధిదారులకు అందే అవకాశం ఉంది. రానున్న ఆర్థిక బడ్జెట్‌లో మళ్లీ కొత్తగా యువతకు సబ్సిడీ రుణాలు కేటాయించే అవకాశం ఉంటుంది. ప్రభుత్వ ఆదేశాల మేరకు యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు కృషి చేస్తాం.

- మల్లికార్జున్, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ, వనపర్తి జిల్లా

మొక్కల పరిరక్షణపై దృష్టి సారించాలి



సవాయిగూడెం శివారు అటవీ ప్రాంతంలో మొక్క నాటిన ఎమ్మెల్యే మేఘారెడ్డి

వనపర్తి రూరల్, జూలై 11: వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా నాటిన ప్రతీ మొక్కను పసిపిల్లాడిలా కాపాడుకోవాలని, మొక్కలు నాటడమే కాదు వాటిని సంరక్షించేందుకు దృష్టి సారించాలని ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి అన్నారు. గురువారం వనపర్తి మండలం సవాయిగూడెం గ్రామ శివారులోని ఫారెస్టు స్థలంలో ఏర్పాటు చేసిన మొక్కలు నాటే కార్యక్రమంలో ఆయన పాల్గొని మొక్కలను నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... చెట్లను పెంచడం ద్వారా పుష్కలంగా ప్రాణ వాయువు లభించడంతో పాటు వర్షాలు సమృద్ధిగా కురుస్తాయని, ప్రతీ ఒక్కరు పుట్టిన రోజు, పెళ్లి రోజు, పండుగ రోజులలో ఇళ్ల వద్ద, పంట పొలాల్లో మొక్కలు నాటి వాటిని పెంచాలని ఆయన సూచించారు. అధికారులు వారం వారం మొక్కల సంరక్షణపై సమావేశం నిర్వహించి మొక్కల పెంపకానికి కావలసిన తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రకృతిని మనం కాపాడితే అది మన భవిష్యత్ తరాలను కాపాడుతుందని తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ కిచ్చారెడ్డి, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు చీర్ల చందర్, మునిసిపల్ వైస్ చైర్మన్ పాకనాటి కృష్ణ, మార్కెట్ యార్డు అధ్యక్షుడు శ్రీనివాస్ గౌడ్, బ్లాక్ కాంగ్రెస్ పెబ్బేరు మండల అధ్యక్షుడు శ్రీనివాస్ గౌడ్, సవాయి గూడెం గ్రామ ప్రత్యేకాధికారి నితిష్, మునిసిపల్ కౌన్సిలర్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు మహిళలు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

అధైర్యపడొద్దు అండగా ఉంటా

వనపర్తి టౌన్: దివ్యాంగులమని అధైర్యపడొద్దు.. అండగా ఉంటానని ఎమ్మెల్యే మేఘారెడ్డి అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని వికలాంగుల పునరావాస కేంద్రంలో ఏర్పాటు చేసుకున్న పేపర్ ప్లేట్ల తయారీ యంత్రాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. మని షికి అంగవైకల్యం అనేది శాపం కాదని, మంచి మనసు లేని ప్రతీ ఒక్కరు అంగవైకల్యులేనని అన్నారు. వైకల్యాన్ని జయించి సమాజంలో పలువురికి స్ఫూర్తిగా నిలవాలని సూచించారు.

అన్ని వర్గాల అభివృద్ధే కాంగ్రెస్ లక్ష్యం

- **కల్యాణ లక్ష్మి చెక్కులను పంపిణీ చేసిన ఎమ్మెల్యే వాకిటి శ్రీధర్**
- **అభివృద్ధి కోరుతూ వినతిపత్రాలు సమర్పించిన నాయకులు**



చెక్కుల పంపిణీ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి

ఆత్మకూరు/అమరచింత, జూలై 11: అన్ని వర్గాల అభివృద్ధి లక్ష్యంగా చేసుకుని కాంగ్రెస్ పార్టీ పాలన సాగిస్తోందని మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి అన్నారు. ఆత్మకూరు మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కల్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహిళా సంక్షేమం కోసం సీఎం రేవంత్‌రెడ్డి కట్టుబడి పని చేస్తున్నారని అన్నారు. అందులో భాగంగానే ఆడబిడ్డలు తల్లిదండ్రులకు భారం కాకూడదనే సదుద్దేశ్యంతో పెళ్లి కానుకగా లక్ష రూపాయలను అందజేసి వారికి ఆర్థికంగా తోడ్పాటును అందిస్తున్నారని తెలిపారు. అలాగే మహిళలకు వడ్డీలేని రుణాలు ఆర్థిక అభివృద్ధి సాధించేందుకు జీవనోపాదుల ద్వారా రుణాలు అందజేస్తుందని తెలిపారు. త్వరలోనే రైతు భరోసా, రైతు రుణమాఫీ చేసి రైతు ప్రభుత్వంగా కాంగ్రెస్ పార్టీ అవతరించనుందని గుర్తు చేశారు. అలాగే ఆత్మకూరును రెవెన్యూ డివిజన్‌గా ఏర్పాటు చేసే వరకు కృషి చేస్తానని త్వరలోనే మండలానికి పీజీ, గురుకుల జూనియర్ కళాశాలను మంజూరు చేయడానికి కృషి చేస్తానని తెలిపారు. అనంతరం 76 మందికి కల్యాణ లక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. ఆత్మకూరు పట్టణ అభివృద్ధి నిమిత్తం నిధులు మంజూరు చేయాలని ఆత్మకూరు మునిసిపల్ పాలక మండలి ఆధ్వర్యంలో ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు. త్వరలోనే రెండు కోట్ల నిధులు మంజూరు చేసే విధంగా కృషి చేస్తానని ఆయన తెలిపారు. వినతిపత్రం సమర్పించిన వారిలో చైర్ పర్సన్ గాయత్రి, వైస్ చైర్మన్ విజయ భాస్కర్‌రెడ్డి, కౌన్సిలర్లు చెన్నయ్య, పోషన్న, మండ్ల రామకృష్ణ, మోహన్‌లు ఉన్నారు. అదేవిధంగా ఆత్మకూరు జూనియర్ సివిల్ కోర్టు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరిని ఘనంగా సన్మానించారు. అదే విధంగా బీజేపీ నాయకులు వినతిపత్రం సమర్పిస్తు ఆత్మకూరులో గురుకుల పాఠశాల, డిగ్రీ కళాశాల, ఆత్మకూరు నుంచి గద్వాల జిల్లాకు వెళ్లేందుకు జూరాల గ్రామం మీదుగా బ్రిడ్జి నిర్మాణం చేసి రవాణా సౌకర్యం కల్పించాలని కోరారు. అమరచింత మండల కేంద్రంలోని ముస్లిం మైనార్టీ కమిటీ ఆధ్వర్యంలో మొహర్రం వేడుకలలో పాల్గొనాలని గురువారం ఎమ్మెల్యే వాకిటి శ్రీహరిని ఆహ్వానించారు. కార్యక్రమంలో ఆత్మకూరు చైర్ పర్సన్ గాయత్రి, వైస్ చైర్మన్ విజయ భాస్కర్ రెడ్డి, తహసీల్దార్ రాజు, ఎంపీడీవో సుజాత, తెలంగాణ కల్లు గీత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నాగరాజుగౌడ్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పరమేష్ తదితరులు ఉన్నారు.

ఫీజుల దోపిడీని అరికట్టాలి



కలెక్టరేట్‌కు ర్యాలీగా వెళుతున్న ఎస్ఎఫ్ఐ నాయకులు, విద్యార్థులు

వనపర్తి టౌన్, జూలై 11: ప్రైవేటు విద్యాసంస్థల్లో జరుగుతున్న ఫీజుల దోపిడీని అరికట్టాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఆది అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలో ఎస్ఎఫ్ఐ నాయకులు చలో కలెక్టరేట్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కోటి ఆశలతో కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణలో ఉన్నత విద్య అంధకారంలో ఉందని, పదేళ్ల పాలన సాగించిన బీఆర్‌ఎస్ ప్రభుత్వం పేద విద్యార్థుల చదువులపై చిన్నచూపు చూసిందన్నారు. ఆరేళ్ల నుంచి విద్యార్థులకు ఇవ్వాల్సిన ఫీజులను చెల్లించకపోవడంతో విద్యార్థులు విద్యను మధ్యలోనే మానేయాల్సిన దుస్థితి ఏర్పడిందన్నారు. రాష్ట్రంలో ఏడాదికి 14 లక్షల మంది విద్యార్థులు స్కాలర్‌షిప్ కోసం దరఖాస్తు చేసుకుంటారని, వారి కోసం సంవత్సరానికి రూ.3వేల కోట్లు అవసరమవుతాయన్నారు. కానీ ప్రభుత్వం ఆరు సంవత్సరాల నుంచి రూ.8,214 కోట్ల ఫీజులు బకాయి ఉందన్నారు. తక్షణమే పెండింగ్‌లో ఉన్న ఫీజు బకాయిలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు రాఘవ, నాయకులు మల్లేష్, అనిల్, సాయి, రమేష్, వెంకటేష్, పూజ, శ్వేత, రాజవర్ధన్, లక్ష్మణ్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యాన సమాజ అభివృద్ధి విద్యార్థులు నడుం బిగించాలి



కళాశాల వార్షికోత్సవం సందర్భంగా విద్యార్థులతో వైస్ ఛాన్సలర్ నీరజ ప్రభాకర్

పెద్దమందడి, జూలై 11: ఆధునిక ఉద్యాన పరిజ్ఞానంపై శిక్షణ పొందిన ఉద్యాన విద్యార్థులు ఉద్యాన సమాజ అభివృద్ధికి నడుం బిగించాలని కొండా లక్ష్మణ్ తెలంగాణ ఉద్యాన విశ్వవిద్యాలయం ఉప కులపతి డాక్టర్ బి.నీరజ ప్రభాకర్ అన్నారు. మోజెర్లలోని ఉద్యాన కళాశాలలో జరిగిన 15వ కళాశాల వార్షికోత్సవానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై ఉత్సవాలను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జీవితంలో ఒడిదుడుకులు సహజమేనని, వాటిని తట్టుకుని నిలబడి ఉన్నప్పుడే విద్యార్థులు విజయానికి చేరువ అవుతారని అన్నారు. మంచి వ్యక్తిత్వం, కష్టపడే అలవాటు, విజయానికి దగ్గర చేరుస్తాయన్నారు. మానవత్వం, మంచితనం, టీంలో పనిచేసే లక్షణాలతో విద్యార్థులు ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఉద్యాన పంటల సాగులో ఒక్క రూపాయి పెట్టుబడి పెడితే మూడు రూపాయల లాభం ఉంటుందని, రైతులు చదువుకున్న యువత ఉద్యాన పంటల సాగుకు మొగ్గు చూపుతున్నారన్నారు. వార్షికోత్సవాలలో విద్యార్థుల ప్రదర్శనలు చూపరులను ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా 2023-24 సంవత్సరపు ఉద్యాన కళాశాల వార్షిక ప్రగతిని కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ పెడిగం సైదయ్య నివేదించారు. కార్యక్రమంలో ఆఫీసర్ ఆఫ్ స్టూడెంట్ ఆఫైర్ బీ రాజశేఖర్, ఓఏఎం డాక్టర్ సహనాజ్, డాక్టర్ ఆర్.పూర్ణిమా మిశ్ర, డాక్టర్ జె.శ్రీనివాస్, డాక్టర్ పి.గౌతమి, డాక్టర్ జి.విద్య, చంద్రశేఖర్, బేబీ రాణి, నాన్ టీచింగ్ స్టాఫ్, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

టీచర్లు ఎప్పుడొస్తారో

వనపర్తి రూరల్, జూలై 11: వనపర్తి పట్టణంలోని మర్రికుంట ప్రాథమిక పాఠశాల విద్యార్థులు టీచర్లకోసం ఎదురుచూస్తున్నారు. ఉదయం 8:45 నిమిషాలకు తెరవాల్సిన పాఠశాల ఉదయం 9:30 అవుతున్నా తెరవలేదు. దీంతో పాఠశాలకు వచ్చిన విద్యార్థులు బయట వరండాలో కూర్చొని టీచర్ల కోసం ఎదురుచూశారు. ఉన్నతాధికారులు స్పందించి ఉపాధ్యాయులు సమయపాలన పాటించే విధంగా చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.



వనపర్తిలోని మర్రికుంట పాఠశాల తెరవకపోవడంతో బయట కూర్చున్న విద్యార్థులు

జనాభా స్థిరీకరణ ప్రతీ ఒక్కరి బాధ్యత



అవగాహన ర్యాలీని ప్రారంభిస్తున్న మునిసిపల్ చైర్మన్

వనపర్తి వైద్యవిభాగం, జూలై 11: పెరుగు తున్న జనాభాను స్థిరీకరించడం ప్రతీ ఒక్కరి బాధ్యత అని జిల్లా అదనపు వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ శ్రీనివాసులు అన్నారు. గురువారం ప్రపంచ జనాభా దినోత్సవాన్ని పురస్కరించుకుని వైద్య, ఆరోగ్య శాఖ అధికారులు జిల్లా కేంద్రంలోని పాలిటెక్నిక్ కళాశాల మైదానంలో ఏర్పాటు చేసిన అవగాహన ర్యాలీని మునిసిపల్ చైర్మన్ పుట్ట పాకల మహేష్‌తో కలిసి జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ.. జనాభాను స్థిరీకరించడానికి ప్రజల్లో చైతన్యం తీసుకురావాలన్నారు. కాన్పుకు, కాన్పుకు మధ్య మూడు సంవత్సరాలు గ్యాప్ ఉండాలని, అలా లేకుండా ఉంటే రక్తహీనత ఏర్పడుతుందన్నారు. ప్రపంచంలోనే 141 కోట్లకు పైగా జనాభాతో భారతదేశం మొదటిలో నిలిచిందని అన్నారు. జనాభాను స్థిరీకరించుకున్నపుడే ప్రపంచ దేశాలతో అభివృద్ధిలో పోటీ పడుతూ ముందుకు సాగు తామన్నారు. కార్యక్ర మంలో కౌన్సిలర్ పెండెం నాగన్న యాదవ్, డాక్టర్ మంజుల, డాక్టర్ రచణ, డాక్టర్ పుష్ప, డాక్టర్ నదియా సాదత్, సిబ్బంది పాల్గొన్నారు.

ఏబీవీపీ వనపర్తి నగర కార్యదర్శిగా జ్ఞానేశ్వర్

వనపర్తి రూర్, జూలై 11: వనపర్తి పట్టణ కేంద్రంలోని అఖిల భారత విద్యార్థి పరిషత్ కార్యాలయంలో గురువారం కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏబీవీపీ వనపర్తి నగర కార్యదర్శిగా జ్ఞానేశ్వర్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యాలయానికి ముఖ్య అతిథిగా వచ్చిన రాష్ట్ర ఏబీవీపీ విభాగ సంఘటన మంత్రి నరేంద్రజీ నియామక పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా జ్ఞానేశ్వర్ మాట్లాడుతూ.. తనపై నమ్మకం ఉంచి ఈ బాధ్యత ఇచ్చిన వనపర్తి జిల్లా శాఖకు ధన్యవాదాలు తెలిపారు. సంయుక్త కార్యదర్శిగా వంశీ, ఓమేష్, రమ్య, ఉపాధ్యక్షుడిగా బంటి, వినయ్, బాలు, నగర కార్యవర్గ సభ్యులుగా అశ్వంత్, గిరిధర్, నితిన్‌లను ఎన్నుకున్నారు.

నిరుద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

వనపర్తి అర్బన్, జూలై 11: అసెంబ్లీ ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీల్లో ఒకటైన నిరుద్యోగుల సమస్యలు పరిష్కరించాలని బీఆర్‌ఎస్ యువజన విభాగం మండల అధ్యక్షుడు సూర్యవంశం గిరి అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాజీ మంత్రి నివాసంలో విలేకరులతో మాట్లాడారు. డీఎస్సీ వాయిదా వేయాలని కోరితే నిరుద్యోగులపై, మీడియాపై పోలీసులతో దాడి చేయించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం ఏర్పడి ఎనిమిది నెలలు కావస్తున్నా ఇప్పటికి విద్యాశాఖ మంత్రిని కేటాయించకుండా విద్యా వ్యవస్థను భ్రష్టు పట్టిస్తున్నారని మండిపడ్డారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం జాబ్ క్యాలెండర్ ప్రకటించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్‌వీ కోఆర్డినేటర్ హేమంత్, నాయకులు సునీల్, రాము పాల్గొన్నారు.

బీసీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్‌కు సన్మానం

వనపర్తి టౌన్/శ్రీరంగాపురం, జూలై 11: కాంగ్రెస్ ప్రభుత్వం తాజాగా నియమించిన బీసీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ నూతి శ్రీకాంత్ గౌడ్‌ను కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్‌యాదవ్, జిల్లా ఓబీసీ చైర్మన్ కోట్ల రవి ఘనంగా సన్మానించారు. గురువారం హైదరాబాద్ బీసీ భవన్‌లో జరిగిన సన్మాన కార్యక్రమంలో పాల్గొన్న అనంతరం శ్రీకాంత్‌గౌడ్‌కు శుభాకాంక్షలు తెలిపి సన్మానం చేశారు. అదేవిధంగా రాజ్య సభ సభ్యుడు అనిల్ కుమార్‌ను కలిసి సన్మానించారు.

ఎన్నికల విధుల్లో పాల్గొన్న ఉపాధ్యాయులకు ఈఎల్స్ మంజూరు చేయాలి

- తపస్ జిల్లా అధ్యక్షులు అమరేందర్ రెడ్డి

వనపర్తి రూరల్, జూలై 11: లోక్‌సభ ఎన్నికల విధుల్లో పాల్గొన్న ఉపాధ్యాయులకు ఆర్జిత సెలవులు (ఈఎల్స్) మంజూరు చేయాలని గురువారం వనపర్తి జిల్లా విద్యాశాఖ అధికారి గోవిందరాజులు తపస్ జిల్లా నాయకులు వినతిపత్రం అందజేశారు. ఉపాధ్యాయులు వేసవి సెలవులను వదిలి అదనంగా డ్యూటీ చేశారు. డ్యూటీలో పాల్గొన్న ఉపాధ్యాయులకు ఆర్జిత సెలవులపై సంబంధిత మండలాల ఎంఈవోలకు, హెచ్‌ఎంలకు జీవో జారీ చేయాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి విష్ణువర్ధన్, వనపర్తి మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు వేముల రాములు, తిరుపతయ్య తదితరులు పాల్గొన్నారు.

పాటు కాల్వను పరిశీలించిన అధికారులు

పెబ్బేరు రూరల్, జూలై 11: రంగాపురంలో పాటు కాలువను ధ్వంసం చేసి, ఈత వనాలను ఎక్స్‌వేటరతో తొలగించిన ప్రాంతాన్ని గురువారం జూరాల డిప్యూటీ ఇంజనీర్ కిరణ్‌కుమార్ పరిశీలించారు. ఈ కాలువ ధ్వంసం కావడంతో కింది భాగంలో ఉన్న కుమ్మరి గుంట చెరువుకు జూరాల నీరు అందదని రైతులు జూరాల అధికారులకు ఫిర్యాదు చేయడంతో విచారణ జరిపారు. ఈ కాలువ జూరాల ఆధీనంలో ఉంటే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని జూరాల అధికారులు తెలిపారు.

కేపీఎస్‌లో విద్యార్థికి అభినందనలు

కొత్తకోట, జూలై 11 : పట్టణంలోని కొత్తకోట ప్యూపిల్స్ స్కూల్ విద్యార్థిని కుమారి వాగ్దేవి (8వ తరగతి) ఇటీవల వనపర్తిలో నిర్వహించిన జిల్లాస్థాయి పర్యావరణ పోటీలో ద్వితీయ బహుమతి గెలుపొందిన సందర్భంగా గురువారం అభినందన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ రాజవర్ధన్‌రెడ్డి, పాఠశాల ప్రిన్సిపాల్ కృష్ణవేణి, డైరెక్టర్ చంద్రహాసన్‌రెడ్డి పాల్గొన్నారు.

స్టాటర్ డబ్బాల కోసం రూ. 20 వేల విరాళం

కొత్తకోట, జూలై 11: శంకర సముద్ర రిజర్వాయర్ కుడి కాలువ ఆయకట్టుకు సాగునీరు అందించడానికి ఏర్పాటు చేస్తున్న పది మోటార్ల స్టాటరు డబ్బాల కోసం రూ. 20 వేల విరాళాన్ని కాంగ్రెస్ పార్టీ మండల నాయకుడు వెంకటరమణ గురువారం రైతులకు అందజేశారు. మోటార్ల మరమ్మతులను ఇరిగేషన్ అధికారులు చేపట్టగా స్టాటర్ డబ్బాలు ఇవ్వలేమని చెప్పారు. దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి విజ్ఞప్తి మేరకు వెంకటరమణ విరాళం ఇవ్వడంతో రైతులు సంతోషం వ్యక్తం చేశారు.